

హిందూపురం ఎంపీ అభ్యర్థిగా ఎంపిక

వీడిన ఉత్కంఠ

మూడోసారి ఎంపీ బరిలో..



పార్థసారథికే.. చాన్స్!

పుట్టపర్తి, మార్చి22(ఆంధ్రజ్యోతి): టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి హిందూపురం ఎంపీ అభ్యర్థి ఎవరన్న ఉత్కంఠకు తెరపడింది. మూడో జాబితాలో హిందూపురం ఎంపీ అభ్యర్థిగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథిని ఖరారు చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. దీంతో గెలుపు గుర్రాలనే రంగంలోకి దింపారన్న చర్చ సాగుతోంది. హిందూపురం ఎంపీ అభ్యర్థి టిక్కెట్ కోసం కూటమిలో టీడీపీ, బీజేపీ నుంచి పలువురు పోటీపడిన నేపథ్యంలో శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. జిల్లాలో మొదటి రెండు జాబితాల్లో కూటమి పొత్తులో భాగంగా హిందూపురం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, రాప్తాడు నుంచి పరిటాల సునీత, పెనుకొండ నుంచి సవిత, మడకశిర నుంచి సునీల్‌కుమార్, పుట్టపర్తి నుంచి పల్లె సంధూరారెడ్డి, కదిరి నుంచి కందికుంట యశోదాదేవిని అభ్యర్థులుగా ఖరారు చేశారు. దీంతో గెలుపు గుర్రాలను బరిలోకి దించారన్న వాదన వినిపిస్తోంది. హిందూపురం ఎంపీతోపాటు ధర్మవరం అసెంబ్లీ టిక్కెట్ ఎవరికి దక్కుతుందోనన్న టెన్షన్ నెలకొంది. ఈ ఉత్కంఠకు తెరదించి హిందూపురం ఎంపీ అభ్యర్థిగా బీకే పార్థసారథిని ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల్లో గెలుపు ధీమా స్పష్టమైంది. దీంతో పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ధర్మవరం మినహా ఆరుచోట్ల టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థుల ఖరారు పూర్తయింది.

బీకే పార్థసారథి రాజకీయ ప్రస్థానం

వయసు: 59 సం..
భార్య : కమలమ్మ
సంతానం: ఐదుగురు కుమార్తెలు, కుమారుడు
కులం : బీసీ (కురుబ), విద్యార్హత: బీఏ
చిరునామా: ఆర్. మరువపల్లి, రొద్దం మండలం
పదవులు: 1985-1991, 1993-94 టీడీపీ రొద్దం మండల అధ్యక్షుడు
1995-1999 జిల్లాపరిషత్ చైర్మన్
1999-2004 హిందూపురం ఎంపీ
2004లో హిందూపురం ఎంపీగా పోటీచేసి, ఓటమి
2005లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎంపిక
2009, 2014లో పెనుకొండ శాసనసభ్యుడిగా వరుసగా రెండుసార్లు ఎన్నిక
2017లో తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యుడిగా ఎంపిక
2019 అసెంబ్లీ ఎన్నికల్లో పెనుకొండ నుంచి పోటీచేసి, ఓటమి
ప్రస్తుతం జిల్లా అధ్యక్షుడిగా సేవలు

విధేయతకు పట్టం

టీడీపీలో 1985లో రొద్దం మండల అధ్యక్షుడిగా ఎన్నికై బీకే పార్థసారథి ప్రస్థానం ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్‌గా, హిందూపురం ఎంపీగా, టీడీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా పని చేశారు. పెనుకొండ నుంచి 2009, 2014లో రెండుసార్లు శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. జిల్లా పునర్విభజన తరువాత శ్రీసత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా సేవలందించారు. 2019లో పెనుకొండ నుంచి పోటీచేసి, ఓడిపోయారు. ఈసారి మళ్లీ పెనుకొండ అసెంబ్లీ టిక్కెట్ ఆశించినా.. పార్టీ అధిష్టానం హిందూపురం ఎంపీ అభ్యర్థిగా పోటీకి అవకాశం ఇచ్చింది. బీకే పార్థసారథి ఉమ్మడి జిల్లాలో సుపరిచితుడే. టీడీపీలో కీలక నేతగా ఎదిగిన బీకేని ఎంపీ అభ్యర్థిగా ఖరారు చేయడం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. దీనిని బట్టి చూస్తే టీడీపీ విధేయతకు పట్టం కట్టిందని నాయకులు, శ్రేణులు భావిస్తున్నారు.





అందరిచూపు ధర్మవరంవైపే..

ఉమ్మడి అభ్యర్థి ఎవరన్న దానిపై ఉత్కంఠ

మిగిలింది.. ఆ ఒక్కటే!

పుట్టపర్తి, మార్చి22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల ఖరారుతో కూటమి ప్రచార దూకుడు పెంచింది. ఇప్పటికే హిందూపురం ఎంపీతోపాటు ఆరు అసెంబ్లీ స్థానాలకు టీడీపీ జనసేన, బీజేపీ కూటమి గెలుపు గుర్రాలనే బరిలోకి దింపింది. ధర్మవరం అసెంబ్లీ సీటు ఒక్కటే ప్రకటించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కూటమి అభ్యర్థి ఎవరనే ఉత్కంఠ నెలకొంది. జిల్లాలో వైసీపీ కంటే ముందుగానే మొదటి జాబితాలో నాలుగు అసెంబ్లీ స్థానాలకు టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థులను ప్రకటించి, ఎన్నికల వేడిరగిలించారు. టీడీపీ, జనసేనతో బీజేపీ పొత్తు కుదిరాక జిల్లాలో జనసేన, బీజేపీకి ఏ స్థానం ఇస్తారనే చర్చకు తెరలేసింది. రెండో జాబితాలో ఈనెల 14న కదిరి, పుట్టపర్తి అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించారు. ఈ నేపథ్యంలో ధర్మవరం అసెంబ్లీ కూటమి అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేస్తారోనన్న ఉత్కంఠ నెలకొంది. శుక్రవారం మూడో జాబితా విడుదల చేసినా ధర్మవరం అసెంబ్లీ స్థానంపై స్పష్టత రాలేదు. పొత్తులో బీజేపీకి ఈసీటు కేటాయిస్తారని ప్రచారం జరుగుతున్నప్పటికీ ఆ పార్టీ అధికారికంగా ప్రకటించకపోవడంతో అందరి చూపు ధర్మవరంపైనే పడింది. పట్టుకేంద్రంగా ప్రసిద్ధికెక్కిన ధర్మవరం అసెంబ్లీ స్థానం నుంచి కూటమి అభ్యర్థిగా ఎవరిని బరిలోకి దింపుతారోనని అందరూ ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. అటు టీడీపీ.. ఇటు బీజేపీ.. మధ్యలో జనసేన తమకేనని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ధర్మవరం అభ్యర్థిగా పరిటాల శ్రీరామ్‌ను ప్రకటించాలని టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున ర్యాలీ చేపట్టారు. తమకే ఇవ్వాలని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు ర్యాలీ చేపట్టారు. కచ్చితంగా బీజేపీకి కేటాయిస్తారంటూ ఆ పార్టీలో చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో ధర్మవరం స్థానం బీజేపీకి ఇస్తారా.. టీడీపీనే వరిస్తుందా అనేది చర్చనీయాంశమైంది. తాజా పరిణామాల నేపథ్యంలో ఆచితూచి అడుగులు వేయాలనే లక్ష్యంతోనే ఉమ్మడి అభ్యర్థి ప్రకటనపై టీడీపీ, జనసేన, బీజేపీ సంయమనం పాటిస్తున్నాయని తెలుస్తోంది. ధర్మవరం నుంచి టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ, జనసేన నుంచి చిలకం మధుసూదన్ రెడ్డి టిక్కెట్ ఆశిస్తున్నారు. పార్టీ కార్యక్రమాలు సైతం ఎవరికి వారుగానే నిర్వహిస్తున్నారు. ఒకట్రెండు రోజుల్లో కూటమి అభ్యర్థి ఎవరనేది తేలిపోవచ్చునని ఆయా పార్టీల శ్రేణులు భావిస్తున్నారు.

అధికార పార్టీలోనూ..

ధర్మవరం అసెంబ్లీ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఎవరనేది ఆయా పార్టీల నేతల శ్రేణుల కంటే అధికార వైసీపీలోనే తీవ్రమైన చర్చ సాగుతోంది. ఇప్పటికే వైసీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని ప్రకటించారు. ఈనేపథ్యంలో కూటమి అభ్యర్థిని బట్టి తమ ఎన్నికల వ్యూహాలకు పదును పెట్టాలని భావిస్తోంది. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ప్రకటన కోసం వైసీపీ నేతలు ఎదురుచూస్తున్నారు. తమకు దీటైన అభ్యర్థినే కూటమి బరిలోకి దింపుతుందనే చర్చ నడుస్తోంది.

ఆంధ్రజ్యోతి బ్రహ్మోత్సవం March 19 April 2 4వ రోజు



సింహవాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న నారసింహుడు

తిరువీధుల్లో ఖాద్రీశుడి విహారం

పులకించిన భక్తజనం

సింహవాహనంపై నృసింహుడు



కదిరి, మార్చి 22: ఖాద్రీ లక్ష్మీనృసింహుడు.. సింహవాహనంపై విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. పట్టణంలో వెలసిన ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం నారసింహుడు.. సింహవాహనం అధిరోహించి, తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం యాగశాల నుంచి విచ్చేసిన శ్రీవారికి గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం శ్రీవారిని సింహవాహనంపై అలంకరించి, ఆలయ ప్రాంగణంలో కొలువుదీర్చారు. కదిరి నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు శ్రీవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తిరువీధుల్లో విహరిస్తూ శ్రీవారు.. భక్తులకు దర్శనమిచ్చారు.

నేడు హనుమంత వాహన సేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి శనివారం హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉదయం నిత్యపూజ, హోమాల అనంతరం గ్రామోత్సవం నిర్వహిస్తారు. సంధ్యా సమయంలో హనుమంతవాహనంపై కొలువుదీరి శ్రీవారు తిరువీధుల్లో విహరిస్తారు. శ్రీ మహావిష్ణువు దశావతారాల్లో ఒకటైన రాముడిని తన భుజస్కంధాలపై మోసిన హనుమంతుడు మరోసారి తనకు అవకాశం ఇవ్వాలని కోరగా, నృసింహావతారంలో నెరవేరుతుందని శ్రీరాముడు వరమిచ్చినట్లు, అందుకే నారసింహుడికి వాహనంగా హనుమంతుడు మారుతాడని భక్తుల నమ్మకం.



ఈ చిత్రంలో కనిపిస్తున్నది మడకశిర మండలం టీడీపల్లి తండాలో మరమ్మతులకు లోనైన తాగునీటి బోరు. రెండు నెలలు గడుస్తున్నా మరమ్మతులు చేయలేదు. దీంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ సమీప తోటల వద్దకెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, తాగునీటి కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.

గ్రామాల గొంతెండుతోంది. ఊళ్లకు ఊళ్లు దాహపు కేకలు పెడుతున్నాయి. వేసవిలో జిల్లా వ్యాప్తంగా చాలాగ్రామాల్లో తాగునీటి కష్టాలు తీవ్రమయ్యాయి. తాగునీటి కోసం రాత్రింబవళ్లు కొళాయిల వద్ద ప్రజలు వేచిఉండే పరిస్థితి నెలకొంది. బోర్లలో నీటిమట్టం తగ్గడంతో అరకొరగా వచ్చే నీటి కోసం ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. తాగునీరు లేక పశువులను సైతం అమ్ముకుంటున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని అధికారులకు విన్నవిస్తున్నా.. చలనం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

- ధర్మవరంరూరల్



ధర్మవరం మండలం బిల్వంపల్లిలో రాత్రివేళ నీటి ట్యాంకు వద్ద ఉంచిన బిందెలు.. అరకొరగా వస్తున్న నీటిని పట్టుకుంటున్న మహిళలు



ఈ చిత్రాలు ధర్మవరం మండలంలోని బిల్వంపల్లిలో నీటి కష్టాలకు అద్దం పడుతున్నాయి. గ్రామంలో రెండు బోర్లున్నాయి. వాటిలో భూగర్భ జల మట్టం తగ్గింది. తరచూ మరమ్మతులకు లోనవుతున్నాయి. దీంతో గ్రామస్థులకు నీటి కష్టాలు తలెత్తాయి. అరకొరగా వస్తున్న నీటిని పట్టుకునేందుకు రోజూ పనులు మానుకుని, ట్యాంకుల వద్ద రాత్రింబవళ్లు ఇలా పడిగాపులు కాయాల్సి వస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చే అరకొర నీటిని ప్రతి కుటుంబం రోజుకు నాలుగైదు బిందెలు మాత్రమే పట్టుకోవాలని నిబంధనను కూడా మహిళలు విధించుకున్నారు. ఆ నీరు అయిపోతే.. మళ్లీ నీరు వచ్చేదాకా అంతే. మనుషులే నీటి కోసం నానా తిప్పలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో పశువుల దాహం తీర్చడం కష్టంగా మారిందనీ, మార్గంలేక వాటిని అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

నీటి కోసం.. ఊళ్లు విలవిల!

- వర్షాభావంతో అడుగంటిన భూగర్భ జలం
- ఎండిపోయిన బోరుబావులు
- వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్న జనం
- పనులు వదులుకుని రోజంతా నీటి వేట
- ముందస్తు చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలం



ట్యాంకర్ల నీరు కొనాల్సిన దుస్థితి

తాగునీటి సమస్య తలెత్తడం, అధికారులు కూడా స్పందించకపోవడంతో ప్రజల కష్టాలు వర్ణనాతీమయ్యాయి. దీంతో స్వయంగా ట్యాంకర్లకు రూ.1000 నుంచి రూ.1500 వెచ్చించి, నీటిని కొనుగోలు చేస్తున్నారు. ధర్మవరం, మడకశిర, ఆగళి, ముదిగుబ్బ, కనగానపల్లి, బత్తలపల్లి, తాడిమర్రి, కదిరి, ఓబుళదేవ

గ్రామాల్లో తీవ్రమైన తాగునీటి ఎద్దడి

రచెరువు, గాండ్లపెంట, పెనుకొండ తదితర మండలాల్లో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యతో పాడి పశువుల దాహం తీర్చడం రైతులకు ఇబ్బందిగా మారింది. దీంతో చేసేది లేక అమ్ముకుంటున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాడిరైతులు జీవనాధారం కోల్పోతున్నారు.

ముందస్తు చర్యలేవీ?

వేసవి నేపథ్యంలో తాగునీటి ఎద్దడి నివారణ దిశగా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏటా ముందుగానే అధికారులు ఏయే గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందో వివరాలు సేకరించి, మండల గ్రాంట్ నుంచి నిధులు విడుదల చేసి, పరిష్కారానికి చర్యలు చేపట్టేవారు. గతేడాది ఖరీఫ్‌లో సరైన వర్షాలు కురవక ప్రస్తుతం బోర్లలో నీటిమట్టం తగ్గి, గ్రామాల్లో నీటి ఎద్దడి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు మేల్కొని నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



సమస్యను పరిష్కరిస్తాం

వర్షాలు లేనందున భూగర్భజల మట్టం పడిపోయింది. వేసవి కావడంతో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తింది. పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటివరకు మా దృష్టికి వచ్చిన తాగునీటి సమస్యలను పరిష్కరించాం. ఇంకా ఉంటే పరిష్కరిస్తాం.

- మల్లికార్జునప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ



కొండాపురంలో వ్యవసాయ బోరు బావి నుంచి నీరు తెచ్చుకుంటున్న చిన్నారులు...

పెనుకొండ నగర పంచాయతీ పరిధి కొండాపురం బీసీ కాలనీలో తాగునీటి కష్టాలకు నిదర్శనాలు ఈ చిత్రాలు. కాలనీలో మొత్తం 60 కుటుంబాలున్నాయి. 400కుపైగా జనాభా నివశిస్తున్నారు. కాలనీలో రెండు బోరు బావులు వారం రోజుల క్రితం మరమ్మతులకు లోనయ్యాయి. దీంతో కాలనీలో నీటి కష్టాలు తలెత్తాయి. కాలనీవాసులు రోజూ పనులు వదులుకుని, ఎండలో చిన్నారులు సహా వ్యవసాయ పొలాల వద్దకెళ్లి, నీటికోసం నానా అవస్థలు పడుతున్నారు.



వ్యవసాయ బోరు బావి వద్ద నీరు పట్టుకుంటున్న దృశ్యం

గణిత పరీక్షకు 1385 మంది గైర్హాజరు

కొత్తచెరువు, మార్చి 22: జిల్లావ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన పదో తరగతి గణిత పరీక్షకు 1385 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఈఓ మీనాక్షి తెలిపారు. 25,675 మంది విద్యార్థులకుగాను 1385 మంది గైర్హాజరయ్యారన్నారు. 24,285 మంది పరీక్షలు రాశారనీ, దీంతో 94.60 శాతం హాజరు నమోదైందని డీఈఓ వెల్లడించారు.

ఉష్ణోగ్రతలు (శుక్ర)	గరిష్ఠం	కనిష్ఠం
పుట్టపర్తి	36.0	23.0
కదిరి	36.0	22.0
ధర్మవరం	37.0	24.0
హిందూపురం	35.0	23.0
పెనుకొండ	36.0	23.0

రంజాన్ వేళలు	ఇఫ్తార్	సెహరీ
పుట్టపర్తి	6.35 శనివారం (సాయంత్రం)	5.01 ఆదివారం (ఉదయం)
కదిరి	6.31 శనివారం (సాయంత్రం)	5.07 ఆదివారం (ఉదయం)
ధర్మవరం	6.36 శనివారం (సాయంత్రం)	5.04 ఆదివారం (ఉదయం)
హిందూపురం	6.34 శనివారం (సాయంత్రం)	5.08 ఆదివారం (ఉదయం)
పెనుకొండ	6.32 శనివారం (సాయంత్రం)	5.05 ఆదివారం (ఉదయం)

సరిహద్దుల్లో నిఘా పెంచండి

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్‌కుమార్ మీనా



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి, మార్చి22: సరిహద్దుల్లో నిఘా పెంచాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్ కుమార్ మీనా.. జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం నుంచి శుక్రవారం జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ముఖేశ్‌కుమార్ మీనా మాట్లాడుతూ... జిల్లాలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద కెమెరాలతో నిఘా పెంచాలన్నారు. కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలు నిర్వహించే ఎటువంటి కార్యక్రమాలకైనా ముందస్తు అనుమతి తప్పనిసరి అని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యానికి తావివ్వద్దన్నారు. ఓటరు జాబితాకు సంబంధించి ఫారం-7, ఫారం-8ను ఈనెల 26లోగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, డీఆర్వో కొండయ్య, నియోజకవర్గాల ఎన్నికల అధికారులు భాగ్యరేఖ, వంశీకృష్ణ, వెంకటశివరామిరెడ్డి పాల్గొన్నారు.

రాజకీయ ప్రకటనలకు అనుమతి తప్పనిసరి : కలెక్టర్

సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రచార మాధ్యమాల్లో ప్రచురితమయ్యే, ప్రసార మయ్యే రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి అని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. చెల్లింపు వార్తలను కమిటీ పర్యవేక్షిస్తుందన్నారు. అభ్యర్థుల ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ కోసం డబ్బిచ్చి.. మోసపోయా..

పోలీసులకు రైతు ఫిర్యాదు



రైతు గోవిందరాజులు

రొద్దం, మార్చి 22: ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు డబ్బిచ్చి మోసపోయాననీ, న్యాయం చేయాలని మండలంలోని రెడ్డిపల్లికి చెందిన రైతు గోవిందరాజులు శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రైతు 2022లో తన పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్నాడు. డబ్బు ఇస్తేనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని లైన్‌మన్ మనోజ్ స్పష్టం చేసినట్లు బాధిత రైతు వాపోయాడు. ఆ మేరకు మనోజ్‌కు రూ.44వేలు ఫోన్‌పే ద్వారా పంపానని రైతు తెలిపాడు. నేటికీ విద్యుత్‌లైన్‌గానీ, ట్రాన్స్‌ఫార్మర్‌గానీ ఏర్పాటు చేయలేదని వాపోయాడు. డబ్బు వెనక్కివ్వాలని కోరినా.. పట్టించుకోలేదని ఆవేదన చెందాడు. తనకు న్యాయం చేయాలని రైతు ఫిర్యాదులో కోరాడు. ప్రస్తుతం లైన్‌మన్ మనోజ్ గుట్టూరులో విధులు నిర్వహిస్తున్నాడనీ, ఫోన్‌చేసినా పట్టించుకోవడం లేదని రైతు తెలిపాడు.

టీడీపీ నాయకుడిపై వైసీపీ మూకల దాడి

సోషల్ మీడియాలో పోస్టు పెట్టాడన్న అనుమానంతో దౌర్జన్యం

కదిరి, మార్చి 22: సోషల్ మీడియాలో తమకు వ్యతిరేకంగా పోస్టు పెట్టాడన్న అనుమానంతో స్థానిక నిజాంవలీకాలనీకి చెందిన టీడీపీ నాయకుడు అయూబ్‌పై వైసీపీ నాయకులు ఇలాహి, ఇమ్రాన్, మహబూబ్‌ఖాన్ శుక్రవారం రాత్రి దాడి చేశారు. బాధితుడు అయూబ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయూబ్ శుక్రవారం రాత్రి ఇంట్లో నమాజు చేసుకుంటుండగా, వైసీపీకి చెందిన ఇలాహి, ఇమ్రాన్, మహబూబ్‌ఖాన్.. మరి కొంతమందితో వచ్చి దాడి చేశారు. విచక్షణారహితంగా కొట్టారు. తీవ్రవంగా గాయపడిన అతడు స్థానికుల సాయంతో ఆస్పత్రికి చేరుకున్నాడు. దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



దాడిలో గాయపడిన అయూబ్

సీ విజిల్ యాప్‌తో అక్రమాలకు అడ్డుకట్ట

ఎలక్షన్ కమిషన్ కొత్త ప్రయోగం

- గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులో యాప్
- సామాన్య ప్రజలనూ భాగస్వామ్యం చేసేందుకే..
- ఆడియో, వీడియో, ఫొటోల ద్వారా ఫిర్యాదు చేసే వెసులుబాటు
- ఫిర్యాదు చేసిన ఐదు నిమిషాల్లోనే స్పందన
- వందనిమిషాల్లో చర్యలు



రిజిస్ట్రేషన్ ఇలా..



ధర్మవరం

ఎలాంటి అక్రమాలు జరగకుండా సార్వత్రిక ఎన్నికలను సాఫీగా నిర్వహించడానికి కేంద్ర ఎన్నికల సంఘం పటిష్ట చర్యలను చేపడుతోంది. అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు అవసరమయ్యే అన్ని రకాల వనరులను ఈసీ వాడుకుంటోంది. అందులో భాగంగానే తీసుకొచ్చిన సీ విజిల్ యాప్ ద్వారా సామాన్య ప్రజలను కూడా భాగస్వామ్యం చేసింది. ఎన్నికల సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించిన నాయకుల పని పట్టేందుకు దీనిని పాశుపతాస్త్రంగా ఉపయోగించుకోవచ్చు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తును దిశ, నిర్దేశం చేసే సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఎన్నికల ప్రవర్తన నియమావళి(మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్)అమలులోకి వచ్చేసింది. ప్రస్తుతం ఉమ్మడిజిల్లాలో ఈ ఎన్నికలు ఎంతో ప్రతిష్టాత్మకంగా మారాయి. అక్రమాలకు, నిబంధనల ఉల్లంఘనకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎలాగైనా గెలవాలని దురుద్దేశ్యంతో అధికారాన్ని అడ్డం పెట్టుకుని రెచ్చిపోయే అవకాశాలు లేకపోలేదు. ఎన్నికల నిబంధనలను సైతం తుంగలో తొక్కేవాళ్లులేకపోలేదు. ఏ రాష్ట్రంలో లేనివిధంగా వలంటీర్ల వ్యవస్థ అధికార పార్టీ కన్ను సన్నల్లో పని చేసేందుకు సిద్ధమవుతోంది. ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటుచేసింది. ఇందులో పౌరులను సైతం భాగస్వామ్యం చేసింది. సీ విజిల్ యాప్ ద్వారా ఈ అవకాశం కల్పించింది. నిబంధనలు ఉల్లంఘించేవారిని పట్టించేందుకు సీ విజిల్ ఎంతగానో దోహదం చేయనుంది.

సీ విజిల్ అంటే ఏమిటి?

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన నాటి నుంచి ఈ సీ విజిల్ యాప్ అందుబాటులోకి వచ్చింది. ఎన్నికల ఉల్లంఘనలపై సాక్ష్యాలతో సహా అందులో పొందుపరచవచ్చు. ఫోటో లేదా వీడియోలేదా ఆడియో రూపంలో రికార్డు చేసి యాప్‌లో అప్‌లోడ్‌చేయాలి. ఫిర్యాదు చేసిన ఐదు నిమిషాల్లో ఎన్నికల అధికారులు రంగంలోకి దిగుతారు. దీనిపై విచారణ చేపట్టి 100 నిమిషాల్లో సదరు ఫిర్యాదుపై ఖచ్చితమైన చర్యలు తీసుకుంటారు. దీన్ని ప్రజలు ఎవరైనా వినియోగించుకోవచ్చు. పార్టీలకు అతీతంగా ఎవరు అవినీతికి పాల్పడినా ఈ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

ఐదు నిమిషాల్లో రంగంలోకి...

యాప్‌లో వివరాలు పొందుపరచగానే జిల్లా ఎన్నికల అధికారి ఐదు నిమిషాల్లో దాన్ని ఫీల్డ్ యూనిట్‌కు పంపిస్తారు. వారు 15 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకుంటారు. విచారించి 30 నిమిషాల్లో వివరాలు సేకరిస్తారు. అనంతరం ఎన్నికల అధికారికి నివేదిక ఇస్తారు. ఆయన దానిపై 50 నిమిషాల్లో చర్యలు తీసుకుంటారు. ఇలా 100 నిమిషాల్లో సీ విజిల్ యాప్‌లో చేసిన ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటారు. మీరు చేసిన ఫిర్యాదు స్టేటస్ కూడా తెలుసుకునే వెసులుబాటు ఈ యాప్‌లో ఉంది.

రిజిస్ట్రేషన్ చేసుకోవడమెలా?

సెల్‌ఫోన్‌లోని గూగుల్ ప్లేస్టోర్‌లో కేంద్ర ఎన్నికల సంఘానికి సంబంధించిన సీ విజిల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. సెల్‌ఫోన్ నెంబరు ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. వచ్చిన ఓటీపీని ఎంటర్ చేసుకుంటే సీ విజిల యాప్ సిద్ధమైనట్లే. దీని ద్వారా ప్రజలు ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు.

ఎలా ఫిర్యాదు చేయాలి?

యాప్ ఓపెన్ కాగానే స్క్రీన్‌పై ఫోటో, వీడియో, ఆడియో ఇలా మూడు ఆప్షన్లు ఉంటాయి. ఫోటో ద్వారా ఫిర్యాదు చేయాలనుకుంటే ఫోటో ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి. మీ లోకేషన్ నమోదవుతుంది. ఉల్లంఘనకు సంబంధించిన ఫోటోను అప్‌లోడ్ చేయాలి. ఏ రాష్ట్రం, ఏ నియోజకవర్గం తదితర వివరాలను నమోదు చేయాలి. సదరు ఉల్లంఘనను క్లుప్తంగా వివరించాలి. ఎన్నికల సంఘానికి చేరుతుంది. యాప్‌లో వివరాలు పొందుపరచగానే జిల్లాఎన్నికల అధికారి సంబంధిత విషయంపై విచారణ జరుపుతారు. సీ విజిల్ యాప్‌లో చేసిన ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటారు. ఇక్కడ ఫిర్యాదు స్టేటస్ కూడా తెలుసుకునే వెసులుబాటు ఉంది. ఎక్కడైనా ఎన్నికల ఉల్లంఘనలు కనిపిస్తే ఎవరైనా సీ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

ఎలాంటి ఫిర్యాదులు చేయాలంటే..

ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించిన దేనిపైనానాసరే ఫిర్యాదు చేయవచ్చు. డబ్బుపంపకాలు, ఉచితాలు, బహుమతులు అందజేయడం, రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం, మద్యం, మత్తుపదార్థాల పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేయడం, ఎన్నికల రోజు ఓటర్లను వాహనాలలో తరలించడం ఇలాంటి ఎన్నికల ఉల్లంఘనకు సంబంధించిన ఫోటో లేదా వీడియో లేదా ఆడియో రికార్డు చేసి అప్‌లోడ్ చేయాలి.

ప్రచారం వీడని వలంటీర్లు

వైసీపీ అభ్యర్థులతో చెట్టాపట్టాల్... విధుల నుంచి పలువురి తొలగింపు


కూర్మాజీపేటలో తాడిపత్రి ఎమ్మెల్యే తనయుడు హర్షవర్ధన్ రెడ్డితో కలిసి ప్రచారంలో పాల్గొన్న గ్రామ వలంటీర్లు రాజశేఖర్, రామాంజనేయులు


ఆర్ అనంతపురం గ్రామంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్పతో కలిసి ప్రచారంలో పాల్గొన్న గ్రామ వలంటీరు రామకృష్ణ


తాడిపత్రి లో వైసీపీ కండువా కప్పించుకుంటున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగి మునీర్


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వసగుడ్డం గ్రామ స్టోర్‌డీలర్ నాగరాజు (ఆకుపచ్చ రంగు చొక్కా వేసుకున్న వ్యక్తి)

(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలో గ్రామ వలంటీర్లు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూనే ఉన్నారు. అధికార పార్టీ అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్నారు. ఈ కారణంగా అధికారులు శుక్రవారం కూడా పలువురిపై చర్యలు తీసుకున్నారు.

- తాడిపత్రి నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి పెద్దారెడ్డి తరపున ఆయన తనయుడు హర్షవర్ధన్ రెడ్డి యాడికి మండలం కూర్మాజీపేటలో శుక్రవారం ప్రచారం చేశారు. రాజశేఖర్, రామాంజనేయులు అనే ఇద్దరు గ్రామ వలంటీర్లు ఆయన వెంట ప్రచారంలో పాల్గొన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపి, తగిన చర్యలు తీసుకుంటామని రాయలచెరువు పంచాయతీ కార్యదర్శి అరుణ్‌కుమార్ తెలిపారు.
- మడకశిర నియోజకవర్గ పరిధిలోని అర్ అనంతపురం గ్రామంలో వైసీపీ అభ్యర్థి ఈరలక్కప్ప శుక్రవా రం ప్రచారం చేశారు. అదే పంచాయతీ ఏడో క్లస్టర్ వ లంటీరు రామక్రిష్ణ ఆయన వెంట ప్రచారంలో పాల్గొన్నారు.
- కదిరి నియోజకవర్గ పరిధిలోని బ్రాహ్మణపల్లి పంచాయతీలో వైసీపీ అభ్యర్థి మగ్బూల్ శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక వలంటీర్లు తిరుపాల్‌రెడ్డి, దాదాపీర్, యానిమేటర్ బాలక్రిష్టారెడ్డి ఆయన వెంట ప్రచారంలో పాల్గొన్నారు.
- డీ. హీరేహాళ్ మండలంలోని పులకుర్తి గ్రామపంచాయతీ వసగుడ్డం గ్రామానికి చెందిన స్టోర్ డీలర్ నాగరాజు శుక్రవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి తనయుడు మెట్టు విశ్వనాథరెడ్డి గ్రామంలో నిర్వహిస్తున్న ప్రచారంలో డీలర్ పాల్గొనడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.


కదిరి: బ్రాహ్మణపల్లి పంచాయతీలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లు తిరుపాల్‌రెడ్డి, దాదాపీర్, యానిమేటర్ బాలకృష్ణారెడ్డి

విధుల నుంచి తొలగింపు

- రాయదుర్గం నియోజకవర్గ పరిధిలో ఇద్దరు వలంటీర్లను అధికారులు విధుల నుంచి తొలగించారు. కణేకల్లు మండల కేంద్రంలో వైసీపీ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న వలంటీర్లు గంగాధర్‌రెడ్డి, లోకేశ్‌రెడ్డిని విధుల నుంచి తొలగించామని ఇన్‌చార్జి ఎంపీడీ ఓ గూడెన్న శుక్రవారం తెలిపారు. కాగా, లోకేశ్‌రెడ్డి వలంటీర్ ఉద్యోగానికి రాజీనామా చేశారని అన్నారు.
- పుట్టపర్తి నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్ రెడ్డితో కలిసి ప్రచాంలో పాల్గొన్న ముగ్గురు వలంటీర్లను అధికారులు విధుల నుంచి తొలగించారు. ఓబుళదేవరచెరువు మండలం తుమ్మలకుంట్లపల్లికి చెందిన వలంటీర్లు అనిల్‌కుమార్, మంజుల, సుబ్బరామయ్యను విధులనుంచి తొలగించామని ఎంపీడీఓ వరలక్ష్మి శుక్రవారం తెలిపారు.
- అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డి తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించిన ముగ్గురు వలంటీర్లపై వేటు పడింది. 38వ సచివాలయ పరిధిలో పనిచేస్తున్న వలంటీర్ బి.కుళ్లాయమ్మ, 36వ సచివాలయం పరిధిలో వలంటీర్లు ఎన్.అబ్బాస్, డి.మహమ్మద్ రఫీని విధుల నుంచి తొలగిస్తూ కమిషనర్ మేఘ స్వరూప్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అర్బన్‌లో ఏకంగా 18 మంది వలంటీర్లు వైసీపీ అభ్యర్థితో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. కొందరిపైనే చర్యలు తీసుకున్నారు. మిగిలినవారి పరిస్థితి ఏమిటో తేలాల్సి ఉంది.
- తాడిపత్రి నియోజకవర్గంలో వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొన్నందుకు తాడిపత్రి మున్సిపల్ కార్యాలయ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మునీర్‌ను విధుల నుంచి తొలగించామని మున్సిపల్ కమిషనర్ రాంమోహన్ శుక్రవారం తెలిపారు.
- ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న డీ హీరేహాళ్ మండలం పులకుర్తి గ్రామ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ విజయ్‌ను విధుల నుంచి తొలగించినట్లు అధికారులు వెల్లడించారు. ఈయన పులకుర్తి గ్రామ పంచాయతీ విధులు నిర్వర్తిస్తున్నాడు. వారం కిందట వైసీపీ ఎన్నికల ప్రచారంలో ఈయన పాల్గొడంపై 'ఆంధ్రజ్యోతి'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు విచారణ చేపట్టారు. అది నిజమని తేలడంతో గురువారం అతడిని విధుల నుండి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని ఏపీఓ రామకృష్ణ తెలియజేశారు.

వైసీపీకి ఓటేయకపోతే పింఛన్ పీకేస్తాం

వలంటీర్ల బెదిరింపులు.. ఆర్డీఓకు బాధితుల ఫిర్యాదు


ఆర్డీఓ భాగ్యరేఖకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

పుట్టపర్తి రూరల్, మార్చి 22: వలంటీర్ల ఆగడాలకు హద్దేలేకుండా పోతోంది. వైసీపీ కోసం ఏకంగా ప్రజలను బెదిరించి, భయభ్రాంతులకు లోనుచేసే స్థాయికి చేరారు. 'వైసీపీకే ఓటెయ్యాలనీ, లేదంటే పింఛన్ పీకేస్తామ'ని వలంటీర్లు బెదిరిస్తున్నారంటూ మండలంలోని కప్పలబండకు చెందిన దివ్యాంగురాలు మాలపాటి చెన్నమ్మ, లక్ష్మీదేవి భర్త శేషగిరిరెడ్డి ఆవేదన చెందారు. ఆ మేరకు ఆర్డీఓ భాగ్యరేఖకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో వారు.. ఆర్డీఓను కలిసి, ఫిర్యాదు చేశారు. బాధితులు మాట్లాడుతూ.. తమ ఆధార్, దివ్యాంగ ధృవపత్రాన్ని వలంటీర్లు తీసుకున్నారన్నారు. వైసీపీకి ఓటు వేయాలని హెచ్చరించారన్నారు. ఓటు ఎవరికి వేశారో తమకు తెలుస్తుందనీ, వైసీపికీ కాకుండా ఇతరులకు వేస్తే పింఛన్ పీకేస్తామంటూ వలంటీర్లు సరోజమ్మ, శ్యామల, రత్నమ్మ బెదిరిస్తున్నారని ఆర్డీఓ దృష్టికి తీసుకొచ్చారు. ఆ మేరకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదుపై ఆర్డీఓను అడగ్గా.. వలంటీర్లపై విచారణ చేయాల్సిందిగా ఎంపీడీఓను ఆదేశించామన్నారు.

మంత్రి ఇంటికి చెక్‌పోస్టు

వైసీపీ సేవలో తరిస్తున్న పోలీసులు...?


మంత్రి ఇంటికి ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు

పెనుకొండ టౌన్, మార్చి 22: రాష్ట్ర స్త్రీ శిశుసంక్షేమ శాఖా మంత్రి ఉషశ్రీ చరణ్ ఇంటికి ఇంకా పోలీస్ బ్యారికేడ్లతో చెక్‌పోస్టు కొనసాగిస్తున్నారు. ఎన్నికల కోడ్ వచ్చి వారం కావస్తున్నా వైసీపీ సేవలోనే పోలీసులు తరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నా యి. పెనుకొండ నియోజక వర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ నివాసం, పార్టీ కార్యాలయం రెండూ స్థానిక డీఎస్పీ కార్యాలయం కాంపౌండ్‌కు ఆనుకుని ఉన్నాయి. గతంలో మంత్రి హోదాలో ఉన్న సమయంలో ఇక్కడ చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అలానే కొనసాగిస్తున్నారు. ఎనికల కోడ్ వచ్చినా... ఇంకా తాను మంత్రినే, నాకు సేవలు చేయాల్సిందే అన్న ధీమాలో వైసీపీ అభ్యర్థి ఉష ఉన్నారని, అందుకే పోలీసులు చెక్ పోస్టును తీసేసేందుకు జంకుతున్నారని ప్రజలు అంటున్నారు. దీన్ని బట్టి చూస్తే ఎన్నికల్లో పోలీసుల తీరు ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా పోలీసులు ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటారా లేక వైసీపీపై భక్తి చూపుతారా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై డీఎస్పీ బాజీ జైన్ సైదాను అడుగగా... ఈ విషయాన్ని స్థానిక ఎస్‌ఐకి తెలిపి చెక్‌పోస్టు తొలగిస్తామన్నారు.


విదుశేఖరభారతీస్వామికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

హైందవ ధర్మాన్ని కాపాడుకోవాలి

విదుశేఖర భారతీస్వామి


కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

అనంతపురం కల్చరల్, మార్చి 22: సనాతన ధర్మాన్ని, హైందవ ధర్మాన్ని కాపాడుకోవాలని శృంగేరి శంకరమఠానికి చెందిన విదుశేఖర భారతీస్వామి పేర్కొన్నారు. స్థానిక శారదానగర్‌లోని శంకరమఠంలో శారదా పరమేశ్వరి పంచలోహ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. వేడుకల్లో పాల్గొనేందుకు విదుశేఖర భారతీ స్వామి శుక్రవారం సాయంత్రం శంకరమఠానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అర్చక బృందం స్వామీజీకి పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ఆవరణంలో స్వామీజి భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. భారతీతీర్థ మహాస్వామి తదితర మహనీయులు దేశపర్యటనలు చేసి హిందూ సంప్రదాయాన్ని నలుదిశలా వ్యాపింపజేశారని తెలిపారు. మహాస్వామి అనంతపురం వచ్చి శారదామాత, ఆదిశంకరాచార్యుల విగ్రహాలను ప్రతిష్ఠించారని, గురువు ప్రతిష్ఠించిన ఆలయంలో తన చేతులమీదుగా ప్రతిష్ఠ చేసే అవకాశం దక్కడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు తెలిపారు. నగరంలో శంకరమఠం ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోందని కొనియాడారు. ఆరు సంవత్సరాల క్రితం ఇదే ఆలయంలో మహాగణపతి విగ్రహ ప్రతిష్ఠకు వచ్చానని, ఇప్పుడు మరోసారి శారదా పరమేశ్వరి పంచలోహ విగ్రహ ప్రతిష్ఠ కోసం వచ్చానని అన్నారు. వేడుకల్లో భాగంగా శనివారం సాయంత్రం అష్టావధానం నిర్వహిస్తామన్నారు. అమ్మవారి ప్రేరణతోనే అనంతపురంలో మూడు రోజుల పాటు పూజల్లో పాల్గొనే అవకాశం దక్కిందన్నారు. రాత్రి ఆలయ ఆవరణంలో చంద్రమౌళీశ్వరస్వామి పూజలు నిర్వహించారు.

రాష్ట్రంలో విచ్చలవిడిగా

గంజాయి, డ్రగ్స్ రవాణా

టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు

అనంతపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా రవాణా జరుగుతోందని మాజీ మంత్రి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కాలవ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖపట్టణంలో 25 వేల కిలోల డ్రగ్స్ పట్టుబడటంపై పాలకులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో స్పష్టంగా అర్థమవుతోందన్నారు. వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి చుట్టూ ఉన్న అనుచరులు నకిలీ మద్యం వ్యాపారంలో, మాదక ద్రవ్యాల స్మగ్లింగ్‌లో ఆరితేరారని ఆరోపించారు. విశాఖలో డ్రగ్స్ పట్టుబడటంపై వస్తున్న విమర్శలు, ఆరోపణలను సజ్జల జీర్ణించుకోలేక తెలుగుదేశం పార్టీని ఆడిపోసుకుంటున్నారని మండిపడ్డారు. వై ఎస్ జగన్ రాజధానిగా చేస్తానన్న విశాఖలోనే పెద్ద ఎత్తున డ్రగ్స్ రాకెట్ బయటపడటం సిగ్గుచేటన్నారు. జగన్ అనుచరులు గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను ధిక్కరిం చి యథేచ్ఛగా విశాఖ మాన్యంలో సహజవనరులను కొల్లగొడుతున్నారని ఆరోపించారు. పట్టుబడిన మాదక ద్రవ్యాల్లో అతి ప్రమాదకరమైన డ్రగ్స్ ఉన్నాయని స్ప ష్టమైందన్నారు. ప్రభుత్వ అధికారులు సహకరించడం లేదని స్వయంగా సీబీఐ ఆ కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లో పేర్కొందన్నారు. విశాఖలో పట్టుబడిన గం జాయిలో జగన్ అండ్ గ్యాంగ్ ప్రమేయముందనేది ప్రస్ఫుటంగా కనిపిస్తోందన్నారు.

తాగునీరు, ఉపాధి పనులపై శ్రద్ధ పెట్టండి

కలెక్టరుకు సీఎస్ ఆదేశం

అనంతపురం టౌన్, మార్చి 22: ఎండాకాలం నేపథ్యంలో ఎక్కడా తాగునీరు, ఉపాధి పనుల విషయంలో ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టరు గౌతమికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) జవహర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం సీఎస్ కలెక్టరు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎండలు పెరిగిన నేపథ్యంలో ఉదయం 5.30 గంటల నుంచి 10.30 గంటల వరకే ఉపాధి పనులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలకు తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరాను పర్యవేక్షించేందుకు ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. వివిధ మంచినీటి పథకాలకు సంబంధించి మరమ్మత్తులుంటే వాటిని వెంటనే రిపేరు చేయించాలన్నారు. నీటికి సంబంధించి నిధుల సమస్య ఉండబోదని, సకాలంలో వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కలెక్టరు గౌతమి మాట్లాడుతూ... జిల్లాలో తాగునీరు, ఉపాధి పనులకు సంబంధించి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ జవహర్‌కుమార్, హెచ్ఎల్‌సీ ఎస్ఈ రాజశేఖర్ పాల్గొన్నారు.

గణిత పరీక్షకు 3, 274 మంది గైర్హాజరు

అనంతపురం విద్య, మార్చి 22: పదో తరగతి పరీక్షల్లో గణితం పేపర్‌కు ఏకంగా 3,274 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. శుక్రవారం జిల్లాలోని 142 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా.... మొత్తం 37,293 మంది రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 34,019 మంది హాజరయ్యారు.

లక్ష్యాలు పూర్తి చేయండి: మార్కెటింగ్‌శాఖ జేడీ

అనంతపురంరూరల్, మార్చి 22: మార్కెట్ ఫీజు లక్ష్యాలను ఈనెల ఆఖరిలోపు పూర్తి చేయాలని మార్కెట్ కమిటీ కార్యదర్శులకు మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజినేయులు ఆదేశించారు. శుక్రవారం జిల్లా మార్కెటింగ్‌శాఖ కార్యాలయంలో ఉమ్మడి జిల్లాలోని మార్కెట్ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తక్కువ సమయం ఉన్నందున వసూళ్లపై ప్రణాళికబద్ధంగా లక్ష్యాలను సాధించడంపై దృష్టి సారించాలన్నారు. గుంతకల్లు, రాప్తాడు, గుత్తి మార్కెట్ కమిటీలు లక్ష్యసాధనలో వెనకబడ్డాయన్నారు. ఉమ్మడి జిల్లాలో మార్కెట్ కమిటీ ఫీజు వసూళ్లు ఆశాజనంగా ఉన్నాయని, చాలా కమిటీలు 90శాతానికిపైగా వసూలు చేశాయన్నారు. వందశాతం వసూళ్లకు కృషి చేయాలన్నారు. అనంతరం అనంతపురం మార్కెట్ కమిటీని సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక అధికారులతో సమావేశమయ్యారు.

బీఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, మార్చి 22: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీఫార్మసీ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఎవాల్యుయేషన్ కేశవరెడ్డి, సీఈ చంద్రమోహన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఫిబ్రవరిలో బీఫార్మసీ తృతీయ సంవత్సరం ప్రథమ సెమిస్టర్(ఆర్19)రెగ్యులర్, సప్లమెంటరీతో పాటు (ఆర్15) సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. అదేవిధంగా ద్వితీయ సెమిస్టర్(ఆర్19,15) సప్లిమెంటరీ పరీక్షలు జరిగాయన్నారు. విద్యార్థులు వారి ఫలితాలకోసం www.jntua.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

రూ.5.30 లక్షలు సీజ్

కదిరి, మార్చి 22: పట్టణ శివారులోని ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో పోలీసుల తనిఖీలో రూ. 5 లక్షల 30వేలు సీజ్ చేసినట్లు ఎస్ఐ బాబ్‌జాన్ తెలిపారు. శుక్రవారం ఓడీసీకి చెందిన గురుశేఖర్ కదిరికి వస్తుండగా తనిఖీ చేశామన్నారు. తనిఖీల్లో డబ్బును సీజ్ చేసి ఆర్డీవో వంశీకృష్ణకు అప్పగించినట్లు చెప్పారు. తనిఖీల్లో సీఐ పుల్లయ్య పాల్గొన్నారు.

రిలయన్స్ మార్ట్‌లో దోపిడీ కుట్ర భగ్నం

అనంతపురం క్రైం, మార్చి 22: అనంతపురం నగరంలోని రిలయన్స్ మార్ట్‌లో దోపిడీ చేసేందుకు పన్నిన కుట్రను వన్‌టౌన్ పోలీసులు భగ్నం చేశారు. ముగ్గురు సభ్యులున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. దీంతో పాటు హౌసింగ్ బోర్డులోని ఓ వ్యాపారి ఇంట్లో దొంగతనం చేయాలని ఇదే ముఠా కుట్ర పన్ని రెక్కీ నిర్వహించింది. ప్రస్తుతం అరెస్టు అయిన బుజ్జల రుష్యంగులు గతంలో గుజిరి, సిల్వరు సామన్లు వ్యాపారం చేసేవాడు. వ్యాపారంలో సుమారు రూ.7 లక్షల వరకు అప్పులయ్యాయి. అప్పులు తీర్చేందుకు తన దూరపు బంధువైన రిలయన్స్ మార్ట్‌లో పని చేసే రాగిరి శ్రీనివాసులు, కళ్యాణదుర్గానికి చెందిన చంటిను సంప్రదించాడు. వీరితో కలసి రిలయన్స్ మార్ట్‌లో దోపిడీ చేయడానికి కుట్ర పన్నాడు. రిలయన్స్ మార్ట్ నుంచి రోజు సుమారు రూ. 25 నుంచి 30 లక్షలు కలెక్షన్ డబ్బులు మేనేజర్ బ్యాంకుకు తీసుకెళ్లుతుంటాడని, మేనేజర్‌ను అడ్డగించి డబ్బులు దోపిడీ చేయాలని భావించారు. ఈ పథకం కోసం రెక్కీ చేశారు. దీంతో పాటు హౌసింగ్ బోర్డులోని ఓ వ్యాపారి ఇంట్లో దోపిడీ చేయాలని పథకం పన్నారు. ఆ ఇంట్లో వృద్ధురాలు, కూతురు, బాలుడు మాత్రమే ఉంటారని, సులువుగా దోపిడీ చేయవచ్చునని భావించారు. దోపిడీ చేసే క్రమంలో అడ్డు వస్తే చంపివేయాలని అనుకున్నారు. స్పెషల్ బ్రాంచి నుంచి సమాచారం అందుకున్న ఎస్పీ ఈ రెండు కుట్రలను భగ్నం చేయాలని ఆదేశించారు. డీఎస్పీ వీరరాఘవరెడ్డి పర్యవేక్షణలో వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప సిబ్బందితో కలసి బృందాలుగా ఏర్పడి నిఘా వేశారు. సూపర్ స్పెషాలిటి ఆసుత్రి వద్ద నిందితులను శుక్రవారం అరెస్టు చేసి వారి నుంచి మూడు వేటకొడవళ్లు, ఐరన్ రాడ్, ఆటో స్వాధీనం చేసుకున్నారు. వీరిలో రుష్యంగులుపై పామిడి, పెనుగొండ, గుత్తి, రాప్తాడు పోలీస్‌స్టేషన్‌లో దొంగతనం కేసులు, అనంతపురం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో హత్య కేసు ఉంది. గొల్ల చండిపై మూడు దొంగతనం కేసులు అనంతపురం టూటౌన్, త్రీటౌన్‌లో ఉన్నాయి.

అత్యాచారం కేసులో పదేళ్ల జైలు

గార్లదిన్నె: ఓ బాలికపై జరిగిన అత్యాచారం కేసులో నిందితుడికి 10ఏళ్ల జైలు శిక్ష, రూ. 3 వేలు జరిమాన విధిస్తూ పోక్సో స్పెషల్ కోర్టు న్యాయాధికారి రాజ్యలక్ష్మి శుక్రవారం తీర్పు ఇచ్చారు. అసోం రాష్ట్రానికి చెందిన పుష్ప బాగ్ అలియాస్ రాజు గార్లదిన్నె మండల కేంద్రంలో ఓ కూరగాయాల మండిలో పనిచేస్తుండేవాడు. అదే గ్రామానికి చెందిన ఓ బాలికకు మాయమాటలు చెప్పి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతి చేశాడు. అనంతరం అక్కడి నుంచి ఉడాయించాడు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు 2023 మే 26న అప్పటి గార్లదిన్నె ఎస్ఐ సాగర్ పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అనంతపురం రూరల్ డీఎస్పీ టీవీ వెంకటశివారెడ్డి 2023 జూన్ 15న కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఈ కేసులో 14 మంది సాక్షులను విచారించారు. పోక్సో స్పెషల్ కోర్టు జడ్జి 10 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ. 3వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసును స్పెషల్ పీపీ విద్యాపతి ప్రాసిక్యూషన్ తరుపున వాదించారు. కోర్టు లైజన్ ఆఫీసర్ ఏఎస్ఐ శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్స్ చౌడిరెడ్డి, శ్రీనివాసులు, కానిస్టేబుల్స్ నాగార్జున, రజాక్ సాక్షులను సకాలంలో కోర్టుకు హజరు పరిచారు. వారిని ఎస్పీ అభినందించారు.

'సూపర్ సిక్స్'తో పేదలకు లబ్ధి: కందికుంట



మహిళలకు నమస్కరిస్తున్న కందికుంట

కదిరి, మార్చి 22: తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టన సూపర్ సిక్స్ పథకాల పేదల అభివృద్ధి సాధ్యమవుతుందని కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. శుక్రవారం తలుపుల మండలంలోని ఉడమలకుర్తి పంచాయతీ ఎలగలవీడు, సోమాలవాండ్లపల్లి, ఇందుకూరుపల్లి, చిన్నపల్లిలో ఆయన విస్తృతంగా ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి టీడీపీకి ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రతి గ్రామంలోని ఆయన పూలమాలలు, హారతులతో స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ టీడీపీతోనే పేదలకు మేలు జరుగుతుందన్నారు. పేద, మధ్య తరగతి వారు అభివృద్ధి చెందాలంటే టీడీపీతోనే సాధ్యమన్నారు. నిరుద్యోగలకు జాబ్‌రావాలన్నా, రైతులకు సాగునీరు అందాలన్నా, మహిళా సాధికసారిత సాధించాలన్నా టీడీపీ రావాలన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. మండల కన్వీనర్ ముబారక్, మేడా శంకర్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థి విస్తృత ప్రచారం



28వ వార్డులో ప్రచారం చేస్తున్న కందికుంట యశోదాదేవి

కదిరి, మార్చి 22: పట్టణంలోని 28 వార్డులో టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్‌పై అభ్యర్థి కందికుంట యశోదాదేవి విస్తృత ప్రచారం చేశారు. శుక్రవారం ఆమె ఇంటింటికి తిరుగుతూ టీడీపీ అధికారంలోకి వస్తే అందించే సంక్షేమపథకాలను వివరించారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఆమెతోపాటు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జగనన్న భూరక్ష సర్వే రాళ్లను తొలగించండి



తహసీల్దార్ శోభాసువర్ణమ్మకు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

తనకల్లు, మార్చి 22: ఎన్నికల కమిషన్ ఆదేశాలను మండలంలో అధికారులు పాటించడం లేదని టీడీపీ నాయకులు ఆరోపించారు. గ్రామాల్లో జగనన్న భూరక్ష సర్వే రాళ్లను అధికారులు తొలగించాలని తహసీల్దార్ శోభాసువర్ణమ్మకు టీడీపీ నాయకులు వినతిపత్రం అందించారు. అధికారులు నిష్పక్షతపాతంగా వ్యవహరించి, ఎన్నికలు సజావుగా సాగేలా కృషి చేయాలన్నారు. మండలంలోని చీకటిమానుపల్లి, దండువారిపల్లి, వెంకటరాయునిపల్లి, ఉలవలవాండ్లపల్లి, దిగువ మండ్లిపల్లి గ్రామాల్లో సర్వేల రాళ్లను పూర్తిచేసినట్లు రెవెన్యూ చెబుతున్నారన్నారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని మూసివేయిస్తామన్నారు. మండల కన్వీనర్ తొట్లి రెడ్డి శేఖర్‌రెడ్డి, నాయుడు, సరోజమ్మ, దస్తగిరి, తెలుగుయువత అధ్యక్షుడు ప్రవీణ్, చిన్నప్ప, చంద్రప్ప, ఉత్తన్ననాయక్ పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఎన్నికల నియమావళి ఉల్లంఘన

పుట్టపర్తి రూరల్, మార్చి 22: రాజకీయ పార్టీలకు సంబంధించిన జెండాలు, హోర్డింగులు, ఫ్లెక్సీలు, తొలగించాలని ఎన్నికల నియమావళి ఉన్నా అవి అమలు కావడంలేదు. మండలంలోని రాచువారిపల్లి పంచాయతీలో విద్యుత్‌శాఖ వారు వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించారు. మీటర్లపై వైఎస్సార్ ఉచిత విద్యుత్ పథకంపేరుతో స్లోగన్లు దర్శనమిస్తున్నాయి. ఫొటోలను కనిపించకుండా ప్రభుత్వానికి సంబంధించిన పథకాలు అందాల్సి ఉండగా ఆదేవిదంగా వ్యవసాయ మీటర్లు ఏర్పాటు చేయడం గమనార్హం .



రాచువారిపల్లిలో విద్యుత్ మీటర్‌పై జగన్ బొమ్మ

ఓబుళదేవరచెరువు: మండల వ్యాప్తంగా చాలా గ్రామాల్లో వ్యవసాయ బోర్ల మీటర్లకు జగనన్న ఉన్న స్టిక్కర్లు దర్శనమిస్తున్నాయి. అధికారులు వాటిని తొలగించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. వ్యవసాయ బోరు మోటార్లకు ఎన్నికల కోడ్ వర్తించదా అని ప్రజాసంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు.

నీటిని సంరక్షించండి

ధర్మవరం, మార్చి 22: ప్రతి ఒక్కరు నీటిని సంరక్షించి భూమిని కాపాడాలని కాకతీయ విద్యానికేతన్ కరస్పాండెంట్ శెట్టిపి నిర్మలా జయచంద్రారెడ్డి, డైరెక్టర్ పద్మ కోరారు. పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్‌లో శుక్రవారం అంతర్జాతీయ నీటి దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్ శెట్టిపి సూర్యప్రకాశ్‌రెడ్డి, ఉపాధ్యాయబృందం పాల్గొన్నారు. అలాగే సూర్యపాఠశాలలో నీటి దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రతి నీటిబొట్టును కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని హెచ్‌ఎం నరేంద్రబాబు అన్నారు. ఉపాధ్యాయులు మారుతి, శీనా, ప్రభావతి, జ్యోతి, హేమ, సుమియ, సునీత పాల్గొన్నారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

తనకల్లు: మండలంలోని కొత్తకురవపల్లి (గొళ్లపల్లి) గ్రామంలో శుక్రవారం జనజాగృతి ఆధ్వర్యంలో ప్రపంచ నీటి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రైతులను సమావేశం పరచి, నీటి సంరక్షణపై అవగాహన కల్పించారు. సంస్థ సాంకేతిక సహాయకుడు చంద్రమోహన్ మాట్లాడుతూ భావితరాలకు నీటిని పొదుపు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి వాటర్ షెడ్ కమిటీ చైర్మన్ హరినాయక్, రైతులు సూర్యనారాయణ, పురుషోత్తమరెడ్డి, సురేష్, నరసింహనాయక్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం



కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్

పుట్టపర్తి రూరల్, మార్చి 22: అనారోగ్యంతో మృతిచెందిన ఏఆర్ కానిస్టేబుల్ కుటుంబానికి జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్ ఆర్థిక సహాయం చెక్కును అందచేశారు. శుక్రవారం ఈమేరకు ఏఆర్ కానిస్టేబుల్ హరికుమార్ భార్య పద్మజకు శాఖాపరంగా రావాల్సిన రూ.1,25,000 చెక్కును ఏఆర్ డీఎస్పీ అందచేశారు. డీఎస్పీ మాట్లాడుతూ శాఖాపరంగా ఇతరత్రా రావాల్సిన ప్రయోజనాలను త్వరగా అందేవిధంగా చూస్తామని కుటుంబానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఓ సుజాత, సూపరింటెండెంట్ సరస్వతి, ఏఆర్ ఆర్‌ఐలు చంద్రశేఖర్, రవికుమార్, సిబ్బంది షౌకత్‌వలి పాల్గొన్నారు.

పన్ను బకాయిలు రూ.7.47 కోట్లు!

- వసూలైంది రూ.1.79 కోట్లు
- తొమ్మిది రోజులే గడువు
- పెనాల్టీ రద్దన్నా స్పందించని ప్రజలు



పుట్టపర్తి, మార్చి 22: పన్నుల వసూళ్లలో పుట్టపర్తి మున్సిపాలిటీ వెనకబడింది. మున్సిపాలిటీగా ఏర్పడి 15 ఏళ్లవుతున్నా పాత బకాయిలు వసూళ్లు చేయడంలో వెనుకబడిందని చెప్పవచ్చు. మున్సిపాలిటీలో 14 వేల గృహాలుండగా పన్ను కట్టింది 20 శాతంలోపే. ఒకప్పుడు అన్ని వ్యాపారాలు కళకళలాడేవి. అటు గృహస్థులకు కానీ ఇటు వ్యాపారులకు పన్నులు చెల్లించడం ఒక లెక్కకాదు. సత్యసాయి శివైక్యం తరువాత ఒక దశలో వ్యాపారాలన్నీ పడిపోయాయి. దీంతో పన్నులు పేరుకుపోయాయి. పాత బకాయిలు రూ.3.10 కోట్లు, వీటికి అపరాధ రుసుం రూ.3.08కోట్లు, ఈ ఏడాది డిమాండ్ రూ.2.87కోట్లు ఉండగా పాత బకాయిలు చెల్లిస్తే పెనాల్టీ మొత్తాన్ని రద్దు చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. దాదాపు 50 శాతం అపరాధ రుసుం రూ.3కోట్లు పైబడి రద్దు కానున్నది. దీంతో మున్సిపాలిటీకి నష్టమైనా పాత బకాయిలు వసూలైతే చాలనుకున్నారు అధికారులు. వసూళ్లలో మాత్రం రోజు రూ.2 లక్షల నుంచి రూ.3లక్షల్లోపే ఉంది.అపరాధ రుసుం రద్దయినా చెల్లించడానికి ముందుకు రాకపోవడం విశేషం.

జిల్లాగా ఏర్పడి రెండేళ్లు...: పుట్టపర్తి కేంద్రంగా సత్యసాయి జిల్లా ఏర్పడి రెండు సంవత్సరాలు కావస్తోంది. జిల్లా ఏర్పాటుతో ఒకపక్క రియల్‌ఎస్టేట్ మరో పక్క వ్యాపారాలు కొంతమేరకు పెరిగాయి. అయినా పన్నులు చెల్లించడంలో ప్రజలు శ్రద్ధచూపడం లేదు. ఇంకా రూ.7.47కోట్లు వసూలు కావాల్సి ఉంది. పన్నుల వసూళ్లపై అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నా స్పందన కరువైంది. సామాన్యులైతే సకాలంలో పన్నులు చెల్లిస్తున్నారే తప్పా బడా వ్యక్తులు చెల్లించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇక గడువు 9 రోజులే: ఈనెల ఆఖరిలోగా పన్నులు చెల్లిస్తే వాటిపై ఉన్న అపరాధరుసుం మొత్తం రద్దు అవుతుందంటూ అధికారులు పేర్కొంటున్నారు. గడువు చూస్తే 9 రోజులే ఉంది. పాతబకాయిలు రూ.2.83కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఈ మొత్తం చెల్లిస్తే దాదాపు అంతే మొత్తం పెనాల్టీ రద్దు అవుతుంది. అయినా పన్నులు చెల్లించడానికి ప్రజలు ముందుకు రాలేదని తెలుస్తోంది.

పన్నుల వసూలుకు ప్రత్యేక కార్యాచరణ



మున్సిపాలిటీలో పేరుకుపోయిన బకాయిలు, కొత్త పన్నుల వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నాం. 20 వార్డుల పరిధిలో సచివాలయ సిబ్బంది పన్నుల వసూళ్లలో నిమగ్నమయ్యారు. ప్రత్యేక వాహనం ద్వారా అపరాధ రుసుం రద్దుపై విస్తృత ప్రచారం చేస్తున్నాం. నెలాఖరులోగా పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రజలు సహకరించాలి.

\- అంజయ్య, మున్సిపల్ కమిషనర్

కందికుంట నిర్దోషి

- కేసులు కొట్టివేసిన తెలంగాణ హైకోర్టు

కదిరి, మార్చి 22: మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకట ప్రసాద్‌ను తెలంగాణ హైకోర్టు నిర్దోషిగా ప్రకటించింది. తనపై ఉన్న రెండు కేసులను తెలంగాణ హైకోర్టు శుక్రవారం కొట్టివేసిందని కందికుంట తెలిపారు. ఈ సందర్భంగా కదిరిలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తనపై సీసీ నంబర్ 2/2003, సీసీ నంబర్ 33/2007 కింద సీబీఐ నమోదు చేసిన కేసులను విచారించిన హైదరాబాదులోని సీబీఐ కోర్టు ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి, గతంలో శిక్ష విధించారని తెలిపారు. ఆ తీర్పులపై తెలంగాణ హైకోర్టులో సీఆర్ఎల్‌పి 454/2016, సీఆర్ఎల్‌పి 1382/2017 ద్వారా అప్పీలు చేసుకున్నానని, దీంతో శిక్షలను నిలుపుదల చేస్తూ తెలంగాణ హైకోర్టు 2018 అక్టోబరు 12న ఉత్తర్వులు ఇచ్చిందని అన్నారు. ఆ ఉత్తర్వులు ఈ రోజు వరకు కొనసాగుతున్నాయని, సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా తనపై నమోదైన కేసులను త్వరగా విచారించాలని కోర్టుకు విన్నవించానని తెలిపారు. తన అభ్యర్థన మేరకు కేసు విచారణ పూర్తి చేసిన తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్.. రెండు అప్పీళ్లపై తీర్పు వెలువరించారని, సీబీఐ కోర్టు విధించిన శిక్షలను రద్దు చేశారని తెలిపారు.

నేటి నుంచి కాటమయ్యస్వామి ఉత్సవాలు

బత్తలపల్లి, మార్చి 22: మండలంలోని సంజీవపురం కాటికోటేశ్వరస్వామి ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం అవుతున్నట్లు ఆలయ కమిటీ పెద్దలు తెలిపారు. శనివారం రెడ్డివారి బోనాలు, సంప్రోక్షణ, ధ్వజారోహణ నిర్వహిస్తారు. రెండవ రోజు కాటమయ్యస్వామి ఉత్సవ ప్రభకు అశ్వ, గజ, నంది వాహనాలపై ఊరేగింపు నిర్వహించి ముష్టూరు నుంచి కాటమయ్యస్వామి కొండవద్దకు తరలిస్తారు. ముడవ రోజు కరణం, రెడ్డి వారి కుటుంబాలు కలసి రెడ్డి వారి ఇంటిలో తెనేటి విందు స్వీకరించి భక్తలతో ముష్టూరు నుంచి కాటమయ్యస్వామి కొండవద్దకు ఊరేగింపుగా చేరుకొని ఉత్సవప్రభకు ప్రత్యక పూజలు నిర్వహించి పురవీధుల గుండా ఊరేగించి లంకా దహనం నిర్వహిస్తారు.



అలంకరణలో స్వామివారు

టీడీపీ శ్రేణుల సంబరాలు

నంబులపూలకుంట, మార్చి 22: కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్‌పై శుక్రవారం తెలంగాణ హైకోర్టు శిక్షను రద్దు చేస్తూ తీర్పును ఇవ్వడంతో మండలంలో టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. బాణసంచా పేల్చి ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దండే రవి, నరసింహులు, అంజనప్పనాయుడు, శ్రీరాములనాయుడు, బాబారాహుల్, మల్లికార్జునాయుడు, రామిరెడ్డి, దండీరా రెడ్డెప్ప, ఉమేష్‌యాదవ్, ధర్మానాయుడు, గంగాద్రి, చలపతినాయుడు పాల్గొన్నారు.

తనకల్లు: మండలంలోని కొక్కంటిక్రాస్, తనకల్లు, చీకటిమానుపల్లి, బొంతలపల్లి, మల్లిరెడ్డిపల్లి గ్రామాల్లో శుక్రమారం తెలుగుతమ్ముళ్లు బాణసంచా పేల్చి మిఠాయిలు పంచి హర్షం వ్యక్తం చేశారు. తమ నాయకుడు కందికుంట వెంకటప్రసాద్‌పై ఉన్న కేసులను తెలంగాణ హైకోర్టు కొట్టివేయడంతో ఆనందంతో కేరింతలు కొట్టారు.



నంబులపూలకుంటలో టపాసులు పేల్చి సంబరాలు చేసుకుంటున్న నాయకులు



నల్లచెరువులో...

గాండ్లపెంట: టీడీపీ కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్‌పై ఉన్న కేసులను తెలంగాణ హైకోర్టు కొట్టివేయడంపై మండల తెలుగు తమ్ముళ్లు శుక్రవారం సంబరాలు జరుపుకున్నారు. గాండ్లపెంట, కటారుపల్లిలో బాణసంచాపేల్చి హర్షం వ్యక్తం చేశారు. మండల కన్వీనర్ కొండయ్య, తాజుద్దీన్, అక్రమ్ బాషా, ప్రశాంత్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లచెరువు: నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్‌పై తెలంగాణ కోర్టు ఇచ్చిన తీర్పుపై మండలంలోని జొగన్నపేట గ్రామ టీడీపీ నాయకులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. నరసింహులు, బెల్లాల నరసింహులు, మాలే నరసింహులు, బెల్లాల శీనా, కె. వెంకటరమణ, రెడ్డెప్ప, మంజు, బాబు, హరి, సురేష్‌బాబు, యోగి పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా సాగేలా చూడాలి: డీఎస్పీ

ధర్మవరం, మార్చి 22: సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని మహిళా పోలీసులకు ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. స్థానిక మారుతీరామవేంద్ర స్వామి కల్యాణమండపంలో శుక్రవారం ఎన్నికల నిర్వహణపై సబ్ డివిజన్‌లోని సచివాలయాల మహిళా పోలీసులకు వర్క్‌షాపు నిర్వహించారు. వారు మాట్లాడుతూ... సార్వత్రిక ఎన్నికలను ప్రతిఒక్క ఉద్యోగి నిజాయితీగా, నిబద్ధగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్, టూటౌన్ సీఐలు సుబ్రహ్మణ్యం, అశోక్‌కుమార్, రామగిరి సీఐ శివాంజనేయులు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

కదిరిఅర్బన్: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం స్వీప్ (సిస్టమ్యాటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) ఆధ్వర్యంలో ఓటుపై అవగాహన కల్పించారు. స్వీప్ నోడల్ అధికారి శివరంగ ప్రసాద్, జిల్లా సోషల్ మీడియా ప్లాటుఫాం నోడల్ అధికారి అబ్దులఖయూం, స్వీప్ నోడల్ అధికారి సత్యనారాయణ, ఎంపీడీఓ ఆంజనప్ప పాల్గొన్నారు. సాధారణ ఎన్నికల్లో ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా నిర్భయంగా ప్రతి ఒకరు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఏపీఓ శ్రీధర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌ఓలు, ఉపాధి సిబ్బంది, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు: ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్నిపార్టీల వారు సహకరించాలని మండలప్రత్యేకాధికారి రమేష్, తహసీల్దార్ ఖాజాబీ కోరారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ, ప్రచారాలు, వాహనాల అనుమతులు తదితర వాటిపై అవగాహన కల్పించారు. సమావేశానికి అధికారపార్టీ నాయకులు హాజరుకాలేదు. ఆర్ఐ నాగేంద్ర, జూనియర్ సహాయకులు భరత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

గాండ్లపెంట: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ క్రిష్ణవేణి ఆధ్వర్యంలో శుక్రవారం గ్రూపు అడ్మిన్లకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉందని, రాజకీయ పరమైన విమర్శలు, పార్టీకి అనుకూలంగా, వ్యతిరేకంగా కించపరిచే ప్రకటనలు, పోస్టులు పెట్టకూడదన్నారు. పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నంబులపూలకుంట: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాని ఎస్ఐ శ్రీధర్ కోరారు. శుక్రవారం మండలంలోని బీఎస్ఎఫ్ సిబ్బందితో కలిసి పోలీసులు కవాతు నిర్వహించారు. గోపాలపురం, వెలిచెలమల, వడ్డిపల్లి, తూర్పునడింపల్లి గ్రామాల్లో కవాతు చేశారు. గ్రామాల్లో ప్రజలతో సమావేశాలు నిర్వహించారు.

అక్రమ మద్యం స్వాధీనం.. ఒకరి అరెస్టు

తాడిమర్రి, మార్చి 22: నకిలీ వే బిల్లుల మాటున అక్రమంగా తరలించిన మద్యాన్ని స్వాధీనంచేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్టు ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అరెస్టు వివరాలను వెల్లడించారు. శుక్రవారం దాడితోట వద్దనున్న అంతర్‌జిల్లా చెక్‌పోస్టులో స్థానిక ఎస్ఐ నాగస్వామి తన సిబ్బందితో తనిఖీలు చేస్తుండగా లారీలో తరలిస్తున్న అక్రమ మద్యం 830 బాక్సుల (రూ.1.50లక్ష) స్వాధీనం చేసుకున్నామన్నారు. దీనిపై తాడిమర్రి పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు నమోదు చేశామన్నారు. మొత్తం 9 మందిపై కేసులు నమోదు చేసి ఒకరిని అదుపులోకితీసుకున్నట్టుగా తెలిపారు. వారిలో ధర్మవరం పట్టణం కేతిరెడ్డికాలనీకి చెందిన షాహిద్‌ఖాన్, దేవానంద్, రజనీకుమార్, శింగనమల మండలం కొరివిపల్లికిచెందిన దూదేకుల కుళ్లాయస్వామి, బత్తలపల్లి మండలం ఈదుల ముష్టూరుకు చెందిన మాలపాటి రవితేజ, యల్లనూరు మండలం తిమ్మంపల్లికి చెందిన సురేశ్, నాగరాజు, తాడిమర్రి మండలం మర్రిమాకులపల్లికి చెందిన కమ్మ నరేశ్‌లపై కేసు నమోదు చేశామన్నారు. దాడిలో పాల్గొన్న తాడిమర్రి ఎస్ఐ నాగస్వామి, సిబ్బందిని డీఎస్పీ, సీఐ కృష్ణంరాజు నాయక్ అభినందించారు.

గొలుసు వ్యాపారాన్ని ఛేదించిన పోలీసులు: అక్రమ మద్యం వ్యాపారం తరచుగా జరుగుతున్నట్టు గుర్తించిన పోలీసులు ఎట్టకేలకు అడ్డుకట్ట వేయకలిగారు. తాడిమర్రిలోని చెత్తతో సంపద సృష్టి కేంద్రంలో నిల్వచేసిన 15 కేసుల గోవా మద్యాన్ని రెండురోజుల క్రితంస్వాధీనం చేసుకున్న పోలీసులు ఈ రెండు రోజుల్లో వారు కూపి లాగి అడ్డుకట్ట వేయకలిగారు. కేతిరెడ్డికాలనీకి షాహిద్‌ఖాన్, తాడిపత్రిలో ఏపీ 02 టీబీ5353 నెంబరు గల లారీని రూ.11లక్షలకు కొనుగోలు చేసి కొరివిపల్లికి చెందిన కుళ్లాయస్వామిని డ్రైవర్‌గా నియమించుకుని అక్కడి నుంచి లారీని గోవాకు తీసుకెళ్లారు. గోవా నుంచి ఆంధ్రప్రదేశ్‌కు మద్యాన్ని తరలించేందుకు ఉపయోగించే బ్యాక్‌అండ్‌బ్యాక్ అప్లికేషన్ యాప్‌లో వివరాలు నమోదు చేశారు. దీనికి సంబంధించి గోవా ప్రభుత్వం ఈ లారీలో మద్యం తరలించేందుకు అనుమతి ఇచ్చింది. దాని ప్రకారం 850 కేసులు మద్యం లోడు చేసుకుని గోవా ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఇందుకు సంబంధించి వే బిల్లులుతీసుకుని వాటిని మదనపల్లి, రేణిగుంట, చిత్తూరులో అన్‌లోడ్‌చేసేందుకు తగిన పత్రాలు పొందుతారు. అదనంగా 90 కేసులు దొంగమద్యం అందులో వేసుకుని గోవా నుంచి హొసపేట, బళ్లారి, గుంతకల్లు, గుత్తి, అనంతపురం, బత్తలపల్లికి చేరుకున్న తరువాత బత్తలపల్లి సరిహద్దులు దాటిన అనంతరం90 కేసుల మద్యాన్ని షాహిద్‌కు అందజేసి మిగిలిన దాన్ని నిబంధనల ప్రకారం సరఫరా చేసేందుకు లారీవెళ్లిపోతుంది. అయితే 90 కేసుల మద్యాన్ని మాత్రం ధర్మవరం, తిమ్మంపల్లి గ్రామాలకు సరఫరా చేస్తున్నట్టుగా పోలీసుల విచారణలో తేలింది.



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు

టీడీపీలోకి 250 వైసీపీ కుటుంబాల చేరిక



పల్లె సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కుటుంబాలు

బుక్కపట్నం, మార్చి 22: పుట్టపర్తి నియోజకవర్గంలోని బుక్కపట్నం, అమడగూరు, కొత్తచెరువులకు చెందిన 250 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. బుక్కపట్నం మండలంలోని బుచ్చయ్యగారిపల్లిలో శుక్రవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పై కుటుంబాలు పార్టీకి చేరారు. నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పల్లె సింధూరారెడ్డితోపాటు, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, పల్లె క్రిష్ణకిషోర్‌రెడ్డి సమక్షంలో వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పల్లె మాట్లాడుతూ అపద్ధాల ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని నమ్మితే మళ్లీ మోసపోవడం ఖాయమన్నారు. తమను గెలిపిస్తే ప్రజలను అభివృద్ధిబాటలో నడిపిస్తానన్నారు. 2019 ఎన్నికల్లో గెలుపొందిన శ్రీధర్‌రెడ్డి సొంత కార్యకర్తలనే పట్టించుకోలేదన్నారు. ఇక ప్రజల అభివృద్ధి ఏమి పట్టించుకుంటారని ఎద్దేవా చేశారు. పల్లె సింధూరారెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గంలోని 193 చెరువులకు హంద్రీనీవా ద్వారా కృష్ణజలాలు అందిస్తామన్నారు. పల్లె క్రిష్ణకిషోర్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబును ముఖ్యమంత్రిని, సింధూరాను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. పార్టీలో చేరినవారిలో బుచ్చగారిపల్లికి చెందిన ఆవుటాల భాస్కర్‌రెడ్డి, ఆవుటాల రామసుబ్బారెడ్డి, బ్యాంక్ శివారెడ్డి, విష్ణు, కుళ్లాయప్ప, కేశప్ప, నాగేంద్ర, ఓబులేసుతోపాటు, అమడగూరు, కొత్తచెరువు మండలాలకు చెందిన 250 కుటుంబాలు చేరారు. కార్యక్రమంలో సోమకోటి ఆదినారాయణ, చింతా మల్లిరెడ్డి, గోపాలపురం గంగాధర్, వెంకటనారాయణరెడ్డి, సుబ్బారెడ్డి, జయరాం, సూరి, బాలు, సయ్యద్, రవి, వెంకటరాముడు, లావణ్యగౌడ్, సాకే యశోదా, రమష్, సుధీర్, సతీష్‌రాయల్ పాల్గొన్నారు.

ధర్మవరం టిక్కెట్ జనసేనకు ఇవ్వాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం



ధర్మవరం, మార్చి 22: నియోజకవర్గంలో వైసీపీని గద్దెదించాలంటే జనసేన పార్టీకి టిక్కెట్ ఇవ్వాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన తన స్వగృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఐదేళ్లగా ధర్మవరంలో వైసీపీ చేస్తున్న అరాచకాలు, దౌర్జన్యాలు, దాడులను ఎదుర్కొంటూ పోరాటాలు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా సేవ్ ధర్మవరం కార్యక్రమాన్ని నిర్వహించి వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేశామన్నారు. తాను టీడీపీ, బీజేపీలకు వ్యతిరేకం కాదని, చంద్రబాబు, పురందేశ్వరి, పవన్‌కల్యాణ్ ఆలోచించి ధర్మవరం టిక్కెట్ జనసేనకు ఇవ్వాలని కోరారు.

వాహనాల తనిఖీ

గాండ్లపెంట, మార్చి 22: మండల కేంద్రంలోని కదిరి, రాయచోటి రోడ్డులో ఎస్ఐ క్రిష్ణవేణి ఆధ్వర్యంలో శుక్రవారం వాహనాలు తనిఖీ చేశారు. ద్విచక్రవాహనాలు, ఆటోలను, కార్లు, లారీలను క్షుణంగా తనిఖీ చేశారు. ఎన్నికల సందర్భంగా అక్రమంగా డబ్బు, మద్యం, ఇతర వస్తువులు తరలింపును అడ్డుకునేందుకు ముందస్తుగా తనిఖీలు చేపట్టామని ఎస్ఐ తెలిపారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. పోలీసులు తిరుమలరెడ్డి, భాస్కర్‌రాజు, శ్రీనివాసులు ఉన్నారు.



గాండ్లపెంటలో తనిఖీ చేస్తున్న పోలీసులు

కొత్తచెరువు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్థానిక మార్కెట్‌యార్డ్ వద్ద, మండల పరిధిలోని కేశాపురం ప్రధాన రహదారిలో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది, ఎన్నికల అధికారులు వాహనాలు తనిఖీ చేశారు. జిల్లా కేంద్రానికి వస్తున్న వాహనాలను ఆపి క్షుణ్ణంగా పరిశీలించి పంపుతున్నారు. రికార్డులను కూడా పరిశీలించారు.

ప్లాస్టిక్‌ను విక్రయిస్తే కఠిన చర్యలు



దుకాణ యజమానికి జరిమానా విధిస్తున్న మున్సిపల్ అధికారులు

ధర్మవరం, మార్చి 22: మున్సిపాలిటీలో ఎవరైనా ప్లాస్టిక్ కవర్లను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని శానటరీ ఇన్‌స్పెక్టర్‌లు శ్యామ్సన్, కేశవ్ హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ రాంకుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలోని అంజుమన్, ఎన్టీఆర్ సర్కిల్, ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో హోల్‌సేల్, రిటైల్ షాపుల్లో దాడులు నిర్వహించి 170 కేజీల ప్లాస్టిక్‌ను సీజ్‌చేసి రూ.26వేలు జరిమానా విధించినట్టు వారు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు హోల్‌సేల్, రిటైల్‌షాపుల్లో ప్లాస్టిక్‌ను అమ్మరాదని, అలాఅమ్మితే జరిమానాతోపాటు కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఘర్షణ కేసులో ఆరుగురి అరెస్టు

బత్తలపల్లి, మార్చి 22: మండల కేంద్రంలో 4వ తేదీన ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో శుక్రవారం ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. అరెస్టు అయిన వారిలో అప్పస్వామి, మోహన్, కిరణ్, నాగరాజు, నల్లప్ప, కాటమయ్య ఉన్నారన్నారు. నిందితులను రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

బస్సు ఢీకొని యువకుడి మృతి

కదిరి అర్బన్, మార్చి 22: మండలంలోని కాళసముద్రం వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ యువకుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు మహారాష్ట్ర రాష్ట్రం రాయగడ్‌కు చెందిన సీతారాం(25) బతుకుదెరువుకోసం తనకల్లు మండలంలోని కొక్కంటి క్రాస్‌లో కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం వ్యక్తిగత పనిమీద ద్విచక్ర వాహనంలో ముదిగుబ్బకు వెళ్లి తిరిగి వస్తుండగా కాళసముద్రం వద్ద కదిరి డిపోకు చెందిన ఆర్టీసీ బసు వేగంగా వాహనాన్ని ఢీకుంది. ఈప్రమాదంలో సీతారాం అక్కడిక్కడే మృతిచెందాడు. పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

'పది' పరీక్షకు 71మంది గైర్హాజరు

గోరంట్ల, మార్చి 22: పట్టణంలో ఆరు కేంద్రాల్లో జరుగుతున్న పదోతరగతి గణితం పరీక్షకు శుక్రవారం 71మంది గైర్హాజరైనట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు. మండలంలోని 1304మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 1233మంది మాత్రమే హాజరయ్యారు. శ్రీవివేకానందలో పదిమంది, శ్రీచైతన్య ఏ- సెంటర్ 15మంది, బీ - సెంటర్‌లో ఐదుగురు, న్యూమాంటి స్టోరిలో 20మంది, ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలలో 21మంది పరీక్షలకు గైర్హాజరైనట్లు తెలిపారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

అగళి, మార్చి 22: స్థానిక కస్తూర్బా బాలికా విద్యాలయంలో ఆరో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఎస్‌ఓ నాగరత్నమ్మ తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదుకు ఏప్రిల్ 11 వరకు గడువు ఉందన్నారు. అదేవిధంగా 7, 8, 9 తరగతులలో మిగిలిన సీట్ల కోసం నమోదు చేసుకోవచ్చన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఓ కోరారు.

కవితల పోటీలో పాల్గొనండి

పెనుకొండ, మార్చి 22 : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా డీహెచ్‌పీఎస్, సత్యసాయిజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కరిజం, దళిత బహుజన తత్వంపై కవితల పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాష శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు పాల్గొనవచ్చన్నారు. అంబేడ్కరిజం, దళిత బహుజన వాదం అంశంపై రాసిన కవితలు మాత్రమే పంపాలన్నారు. ఈ పోటీలకు ఎలాంటి రుసుము, చందా అవసరం లేదన్నారు. 25పంక్తులకు మించకుండా రాసిన కవితలను స్వీకరిస్తామన్నారు. గెలుపొందిన మొదటి కవితలకు నగదు బహుమతులు చెల్లించి, అంబేడ్కర్ కవితా పురస్కారంతో సత్కరిస్తామన్నారు. వారితో పాటు 133మంది కవులను ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలతో సత్కరిస్తామన్నారు. తమ కవితలను ఏప్రిల్ 5లోగా రచయితల సంఘం అధ్యక్షుడికి పంపాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ ఫోన్ నెం. 9440805955కు సంప్రదించాలన్నారు.

రేపు మూర్ఛవ్యాధి వైద్యశిబిరం

పెనుకొండ, మార్చి 22: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం మూర్ఛవ్యాధి ఉచిత చికిత్స శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జేవీవీ జోన్ కన్వీనర్ ఇమాన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఘనగిరి విద్యానికేతన్ పాఠశాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1వరకు శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. పెనుకొండ పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 9491355200, 7680824364, 9398913631కు సంప్రదించ వచ్చని ఆయన తెలిపారు.

దేవాలయ నిర్మాణానికి ఆర్థిక సాయం



చెక్కును అందిస్తున్న మంజునాథ ట్రస్ట్ సిబ్బంది

గుడిబండ, మార్చి 22: మండలంలోని మోపురగుండ్లు గ్రామంలో తిమ్మప్పస్వామి దేవాలయ నిర్మాణానికి కర్ణాటక రాష్ట్రంలోని ధర్మస్థల మంజునాథ స్వామి ట్రస్ట్ శుక్రవారం ఆర్థిక సాయం అందించింది. మోపురగుండ్లు గ్రామంలో తిమ్మప్పస్వామి దేవాలయ నిర్మాణం జరుగుతూ అర్థంతరంగా నిలిచిపోయింది. ఆ దేవస్థానం కమిటీ సభ్యులు ధర్మస్థలానికి వెళ్లి మంజునాథ స్వామి ట్రస్ట్ వ్యవస్థాపకులైన వీరేంద్ర హెగ్డేను ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం కోరారు. దీంతో ట్రస్ట్ పావగడ యోజన అధికారి మహేష్ మోపురగుండ్లు గ్రామానికి వచ్చి ఆలయ కమిటీ సభ్యులకు రూ.లక్ష చెక్కును అందజేశారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

గోరంట్ల, మార్చి 22: అనారోగ్యంతో బాధపడుతున్న పట్టణానికి చెందిన టీడీపీ మైనార్టీ సీనియర్ నాయకుడు అజంతుల్లాను ఆ పార్టీ నాయకులు శుక్రవారం పరామర్శించారు. రెండురోజుల కిందట బీపీ తగ్గిపోవడంతో అజంతుల్లా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. టీడీపీ నాయకులు ఆయన నివాసానికెళ్లి ఆరోగ్యంపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి నరసింహులు, మండల కార్యదర్శి అశ్వత్థరెడ్డి, నాయకులు నీలకంఠారెడ్డి, బెల్లాలచెరువు చంద్ర, నరసింహప్ప, మనోహర్, మూర్తి, బాలక్రిష్ణ, ఆంజనేయులు, రాము, సోము, కిషోర్, మణి తదితరులున్నారు.

చెక్‌పోస్టును తనిఖీ చేసిన సబ్ కలెక్టర్



చెక్‌పోస్టు అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అపూర్వభరత్

రొద్దం, మార్చి 22 : ఎన్నికల సందర్భంగా ఆర్ మరువపల్లిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వభరత్ శుక్రవారం తనిఖీ చేశారు. కర్ణాటక వైపు నుంచి వచ్చే వాహనాలను సక్రమంగా తనిఖీ చేస్తున్నా రా లేదా అనే విషయాన్ని ఆయన పరిశీలించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి మద్యం, డబ్బు రవాణా కాకుండా చూడాలని రెవెన్యూ, మండల పరిషత్ అధికారులకు సూచించారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కేశవరెడ్డి ఇన్‌చార్జ్ తహసీల్దార్ చంద్రశేఖర్, వీఆర్‌ఓలు అనిల్‌కుమార్, నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్ట్

లేపాక్షి, మార్చి 22 : మండంలోని మామిడిమాకులపల్లిలో గురువారం రాత్రి పేకాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ గోపి తెలిపారు. గ్రామంలో వీధి దీపాల కింద యథేచ్ఛగా పేకాడుతున్నట్లు సమాచారం అందడంతో తన సిబ్బందితో దాడిచేసినట్లు ఎస్‌ఐ తెలిపా రు. పేకాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి ఆరు సెల్‌ఫోన్‌లు, రూ.1500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

టీడీపీతోనే మైనార్టీల అభ్యున్నతి: సవిత



పట్టణంలో మురుగు కాలువ దుస్థితిని చూపుతున్న సవిత

పెనుకొండ టౌన్, మార్చి 22 : రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని, వారి సంక్షేమానికి పార్టీ పెద్ద పీట వేస్తుందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పేర్కొన్నారు. ఆమె శుక్రవారం పట్టణంలోని దర్గాపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ ముస్లింల ఓట్లతో అధికారంలోకి వచ్చిన వైసీపీ మైనార్టీలకు ఏం చేసిందని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో ఇంజనీరింగ్ కళాశాలలు, హజ్ హౌస్‌లు, షాదీఖానాలు నిర్మించిన ఘనత తమదే అన్నారు. వైసీపీ ప్రభుత్వం కేవలం ఆర్భాటం తప్ప రాష్ట్రానికి, ముస్లిం మైనార్టీలకు ఒరగబెట్టిందేమీ లేదని మైనార్టీ నాయకులు అన్నారు. రానున్న రోజుల్లో ఈ ప్రభుత్వానికి ముస్లింలు బుద్ధిచెప్పడం ఖాయ మన్నారు. టీడీపీ హయాంలో దుల్హన్ పథకం ద్వారా ముస్లిం యువతుల వివాహానికి రూ.50వేలు అందిస్తే.. జగన్ తాను అధికారంలోకి వస్తే రూ.లక్ష ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చాక ఆ పథకానికి పలు నిబంధనలు పెట్టి నీరుగార్చారన్నారు. ఇస్లామిక్ బ్యాంక్‌లు ఏర్పాటు చేసి వడ్డీలేని రుణాలు ఏర్పాటు చేస్తామని మోసం చేశారన్నారు. సీఎం జగన్ ముస్లింల ద్రోహి అన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకుడు దాదు, షౌకత్, మాజీ మండల కన్వీనర్ శ్రీరాములు, జిల్లా అధికార ప్రతినిధి రఘువీరచౌదరి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి 40కుటుంబాల చేరిక : మండలకేంద్రమైన సోమందేపల్లికి చెందిన 40 కుటుంబాలు శుక్రవారం వైసీపీని వీడి టీడీపీలోకి చేరాయి. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత వారికి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గాజుల ప్రసాద్, మనోహర్, బుల్లెట్ వెంకటేశు, శ్రీనివాసులు, తేజ, నక్కలగుట్ట రామచంద్ర, గాజుల నవీన్, రామక్రిష్ణ, గాజుల హరీష్, రామక్రిష్ణ, సురేంద్ర, జగన్నాథ్ తదితరులు ఉన్నారు.

మరోమారు బాలకృష్ణను గెలిపించుకుందాం

టీడీపీ, బీజేపీ, జనసేన ఆర్యవైశ్య నాయకులు

హిందూపురం అర్బన్, మార్చి 22: స్థానిక ఎమ్మెల్యేగా మరో మారు నందమూరి బాలకృష్ణను గెలిపించుకుందామని టీడీపీ, బీజేపీ, జనసేన ఆర్యవైశ్య నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా స్థానిక పరమేశ్వరీ హాల్‌లో శనివారం సాయంత్రం 5 గంటలకు ఆర్యవైశ్య వ్యాపారుల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. హిందూపురం నియోజకవర్గాన్ని అభివృద్ధిబాటలో నడిపేందుకు, ఎన్డీఏ కూటమికి సహకారం అందిస్తామని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డూండీ రాకేష్ హాజరు కానున్నట్లు వారు తెలిపారు. హిందూపురం ఆర్యవైశ్య కులస్థులు హాజరు కావాలని వారు కోరారు.

రేపు టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం

మడకశిరటౌన్, మార్చి 22: పట్టణంలోని యాదవ కల్యాణ మండపంలో ఆదివారం టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్య క్షుడు గుండుమల తిప్పేస్వామి శుక్రవారం తెలిపారు. సమావేశం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. భవిష్యత్తు రాజకీయ కార్యాచరణ ప్రణాళికపై నాయకులు, కార్యకర్తలతో చర్చించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఐదు మండల పరిధిలోని పార్టీ మండల కన్వీనర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, జిల్లా అనుబంధ సంఘాల నాయకులు తదితరులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బలహీన వర్గాల ఆనందమే ధ్యేయం: సవిత



బజ్జీలు వేస్తున్న టీడీపీ అభ్యర్థి సవిత

పెనుకొండ టౌన్, మార్చి 22: బడుగు బలహీన వర్గాల ప్రజల జీవితాల్లో ఆనందం నింపడమే టీడీపీ ధ్యేయమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పేర్కొన్నారు. అందుకోసం టీడీపీ అధినేత చంద్రబాబు సరికొత్త పథకాలకు రూపకల్పన చేశారని తెలిపారు. ఆమె శుక్రవారం సోమందేపల్లి మండలం బ్రాహ్మణపల్లి పంచాయతీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ, సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ.. ఐదేళ్ల జగన్ పాలనలో సామాన్య ప్రజల జీవితాల్లో ఆనందం లేదన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమని ఆమె ప్రజలకు వివరించారు.

మడకశిరలో తాగునీటి ఎద్దడి

నెలరోజులుగా ఇబ్బందులు పడుతున్న పలు వార్డుల ప్రజలు

పట్టించుకోని నగర పంచాయతీ అధికారులు



మడకశిరలోని మారుతీ నగర్‌లో మరమ్మతులకు లోనైన బోరు

మడకశిరటౌన్, మార్చి 22: నగర పంచాయతీ పరిధిలోని పలు వార్డులలో నీటి సమస్య జఠిలంగా మారింది. నెల రోజులకు పైగా నెలకొన్న సమస్యను పరిష్కరించేందుకు నగర పంచాయతీ అధికారులు ఏమాత్రం చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. చిన్న చిన్న మరమ్మతులకే వారు దాదాపు 15 నుంచి నెల రోజుల సమయం తీసుకుంటు ఉండటంతో నీటి సమస్య జఠిలంగా మారిందని పట్టణ వాసులు విమర్శిస్తున్నారు. దీంతోపాటు భూగర్భ జలాలు అడుగంటుతుండటంతో బోర్లలో నీటిమట్టం తగ్గిపోయిందని, దీంతో నగరపంచాయతీ పరిధిలో నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని అంటున్నారు. పంచాయతీ బోర్లలోకి అదనంగా పైపులు దింపడం వల్ల సమస్య పరిష్కారమవుతుందని అంటున్నారు. అయినా అధికారులు ఆదిశగా చర్యలు చేపట్టడం లేదని వాపోతున్నారు. మారుతీ నగర్‌లో ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో ఉన్న బోరు, స్టార్టర్ చెడిపోయి 15 రోజులు గడుస్తున్నా మరమ్మతులు సైతం చేయలేని పరిస్థితుల్లో మున్సిపాలిటీ అధికారులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా మోటారు మరమ్మతులకు రావడంతో దాదాపు 20 రోజుల నుంచి నీటి సరఫరా ఆగిపోయిందని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే 12వవార్డు, చౌటిపల్లి, శివాపురంలోని పలు కాలనీల్లో నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని ఆయా కాలనీల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మోటారు, స్టార్టర్ వంటి వాటికి మరమ్మతులు చేయించాలని అంటున్నారు. తద్వారా నగర పంచాయతీ పరిధిలో నీరు సరఫరా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొత్తచామలపల్లిలో...

చిలమత్తూరు: మండలంలోని కొత్తచామలపల్లిలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని ఆ గ్రామస్థులు పేర్కొన్నారు. గ్రామంలో రెండు బోరుబావుల ద్వారా తాగునీరు అందేదని, అయితే వాటిలో భూగర్భజలాలు అడుగంటడంతో సమస్య వచ్చిందన్నారు. తాము నెల రోజులుగా నీటి కోసం ఇబ్బందులు పడుతున్నా పట్టించుకున్న వారే లేరన్నారు. సమస్యపై గ్రామ సర్పంచ్‌కు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. వ్యవసాయ బోరుబావుల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటూ అవసరాలకు వాడుకుంటున్నామని వాపో యారు. అయితే ప్రస్తుతం వేసవి కావడంతో కొందరు రైతులు పంటల సాగుకు నీళ్లు తగ్గుతాయని తమను రానివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజులుగా తీవ్ర ఇబ్బం దులు పడుతున్నా గ్రామానికి వచ్చి సమస్య తెలుసుకోవడంలో పాలకవర్గం, అధికార గణం పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఇప్పటికైనా కొత్త బోరుబావి తవ్వించిగానీ లేదా తాత్కాలిక చర్యలు చేపట్టిగా సమస్య పరిష్కారం అయ్యేలా చూడాలని గ్రామస్థులు కోరుకుంటున్నారు. సమస్య పరిష్కరించకపోతే గ్రామస్థులందరం కలిసి పెద్ద ఎత్తున ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆందోళన చేపడతామన్నారు.



సేవా మందిరంలో సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు



గోరంట్లలో సంబరాలు జరుపుకుంటున్న దృశ్యం

బీకేకి పురం టిక్కెట్టుపై సంబరాలు

హిందూపురం అర్బన్ / పెనుకొండ/ గోరంట్ల, మార్చి 22: టీడీపీ హిందూపురం పార్లమెంట్ అభ్యర్థిగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారధి పేరును అధిష్టానం శుక్రవారం ప్రకటించడంతో పలు ప్రాంతాల్లో టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. పరిగి మండలం పరిధిలోని సేవామందిరం కూడలిలో బాణసంచాపేల్చి మిఠాయిలు పంచిపెట్టారు. అలాగే పెనుకొండ నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పెనుకొండలోని బీకే పార్థసారథి కార్యాలయం వద్దకు చేరుకుని పెద్దఎత్తున బాణసంచా పేల్చారు. అనంతరం కార్యాలయంలో ఒకరినొకరు మిఠాయిలు తినిపించుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. గోరంట్లలోని గాంధీ సర్కిల్, బస్టాండ్ వద్ద పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు మిఠా యిలు పంచారు.

బస్సు ఢీకొని యువకుడి మృతి

కదిరిఅర్బన్, మార్చి 22: మండలంలోని కాళసముద్రం వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ యువకుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు మహారాష్ట్ర రాష్ట్రం రాయగడ్‌కు చెందిన సీతారాం(25) బతుకుదెరువుకోసం తనకల్లు మండలంలోని కొక్కంటి క్రాస్‌లో కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం వ్యక్తిగత పనిమీద ద్విచక్ర వాహనంలో ముదిగుబ్బకు వెళ్లి తిరిగి వస్తుండగా కాళసముద్రం వద్ద కదిరి డిపోకు చెందిన ఆర్టీసీ బసు వేగంగా వాహనాన్ని ఢీకుంది. ఈప్రమాదంలో సీతారాం అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

ఆధార్ నమోదు సేవలు బంద్

ఇబ్బందుల్లో ప్రజలు

పెనుకొండ రూరల్, మార్చి 22 : మండలంలోని నాలుగు రోజుల నుంచి ఆధార్ నమోదు సేవలు బంద్‌కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల వ్యాప్తంగా కొత్తగా ఆధార్ నమోదుతో పాటు ఆధార్‌లో పేర్ల మార్పులు, చేర్పుల కోసం పెనుకొండలోని సచివాలయం -3లో అధికారులు వెసలుబాటు కల్పించారు. ఆధార్ కేంద్రం ఏర్పాటు చేశారు. అయితే ఎన్నికల కోడ్ అమలుకాగానే పట్టణంలోని సచివాలయం-3లో ఆధార్ సేవలు నిర్వహిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్‌ను ఎన్నికల విధుల్లోకి తీసుకున్నారు. ఆయనను సబ్ కలెక్టర్ కార్యాలయానికి పంపారు. దీంతో నాలుగు రోజులుగా సచివాలయం -3లో ఆధార్ సేవలు బంద్ అయ్యాయి. మండల వ్యాప్తంగా చిన్నారుల నుంచి పెద్దల వరకు ఆధార్ సేవల కోసం రోజూ సచివా లయం-3 వద్దకు వచ్చి వెనుతిరగాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి సచివాలయం -3లో ఆధార్ సేవల కోసం ప్రత్యామ్నాయంగా మరొకరిని నియమించాలని, ఆధార్ సేవలను కొనసాగించాలని స్థానికులు కోరుతున్నారు.



ఖాళీగా దర్శనమిస్తున్న సచివాలయం -3లోని ఆధార్ నమోదు కేంద్రం

నేటి నుంచి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు



లక్ష్మీనరసింహస్వామి మూల విరాట్

రొళ్ల, మార్చి 22: మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు శని వారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. ఉత్సవాలు శనివారం ప్రారంభమై పది రోజుల పాటు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ముఖ్యంగా భూతప్ప ఉత్సవాలు అందరినీ అలరిస్తాయి. భూతప్ప ఉత్సవాలను మూడు రోజుల ముందుగా కొండపై వెలిసిన ఉగ్రనరసింహస్వామి ధ్వజస్తంభం జ్యోతిని వెలిగిస్తారు. ఈ ఉత్సవాలకు కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు.

ఉత్సవాలు ఇలా... మొదటి రోజు శనివారం అంకురార్పణ, ఆదివారం కలశ స్థాపన ఉంటాయి. అలాగే 25న బ్రహ్మరథోత్సవం, 26న వసంతోత్సవం, 27న గరుడోత్సవం, 28న పూలపల్లకి, 29న దేవతా కీర్తనోత్సవం జరుగుతాయి. ఈ నెల 30న భూతప్ప ఉత్సవాలు, 31న 101 దేవతలకు నైవేద్యం, ఏప్రిల్ 1న మహా మంగళారహారతి, తీర్థ ప్రసాద వినియోగం చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ఆలయం

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు : ఆర్‌ఓ



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్‌ఓ గౌరీ శంకర్

మడకశిర టౌన్, మార్చి 22: ఎన్నికల నియమావళి, నిబంధనలను తప్పక పాటించాలని మడకశిర ఎన్నికల రిటర్నింగ్ అధికారి గౌరీ శంకర్ అన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే తప్పక చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల నియమావళిపై విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల కోడ్‌ను తప్పనిసరిగా పాటించాలన్నారు. కోడ్ పాటించని రాజకీయ పార్టీలపై చట్ట పరిధిలో చర్యలు తప్పవన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్నికలకు 237 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా బ్యానర్లు ఏర్పా టు చేయడం ఫ్లెక్సీలు కట్టడం, ఇతరత్రా ఏ నిబంధనలు అతిక్రమించినా చర్యలు తప్పవన్నారు. అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులపై నిఘా ఉంచుతామని తెలిపారు. నిబంధనల మేరకే ఎన్నికల వ్యయం ఉండాలన్నారు. ఎన్నికల ప్రచార సరళిపై పూర్తి స్థాయిలో నిఘా ఉంచామ న్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలపై నిఘా పెట్టినట్లు తెలిపారు. నియోజకవర్గంలో ప్రశాంతంగా ఎన్నికలు జరిగే విధంగా అందరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటేష్, ఎన్నికల డిప్యూటీతహసీల్దార్ మారుతీప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణపై అవగాహన ర్యాలీ



నీటి సంరక్షణపై గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మడకశిర రూరల్ మార్చి 22: నీటి సంరక్షణ బాధ్యత అందరూ తీసుకోవాలని స్థానిక ఉద్యాన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ పేర్కొన్నారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా శనివారం ఉద్యాన కళాశాల దత్తతు గ్రామమైన గంగుళవాయిపాళ్యంలో విద్యార్థులు నీటి సంరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎంతో విలువైన నీటిని సంరక్షించే బాధ్యత అందరిపై ఉందన్నారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు గ్రామస్థులు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయాలి

అమ్మవారిపల్లి రైతుల వేడుకోలు

పెనుకొండ రూరల్, మార్చి 22: తాము 40ఏళ్లుగా సాగుచేస్తున్న భూములకు రెవెన్యూ అధికారులు మరొకరికి పట్టాలు మంజూరు చేశారని అమ్మవారిపల్లి రైతులు పార్వతమ్మ, శ్రావణి, గోవిందరెడ్డి, లోకేష్‌రెడ్డి తదితరులు వాపోయారు. వారు తమ గోడును విలేకరుల వద్ద వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మునిమడుగు పొలం సర్వే నంబరు 815లోని 24ఎకరాల భూమిని ఏడుగురు రైతులం తమ పూర్వీకుల నుం చి సాగుచేసుకునేవాళ్లమని తెలిపారు. ఆ భూములకు అప్పట్లో రెవెన్యూ అధికారులు సా గుపట్టాలు మంజూరు చేశారన్నారు. అయితే గుట్టూరు, వెంకటగిరిపాళ్యం, మోటువారిపల్లి గ్రామాలకు చెందిన కొందరితో రెవెన్యూ అధికారులు కుమ్మక్కయి తాము సాగుచేసుకుంటున్న భూములకు వారికి పట్టాలు మంజూరు చేశారని వాపోయారు. నిబంధనల ప్రకారం 20ఏళ్లుగా సాగుచేస్తున్న రైతులకు ఫ్రీ హోల్డర్ పట్టా మంజూరు చేయాలన్నారు. అయితే 2012-13 సంవత్సరం భూ పంపిణీలో తాము పొంది సాగుచేసుకుంటున్న 815సర్వే నంబరులోని భూములకు రెవెన్యూ అధికారుల వేరే వారికి ఫ్రీ హోల్డర్ పట్టాలు మంజూరు చేవారని బాధితులు వాపోయారు. ఈ విషయంపై సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో అర్జీలు ఇచ్చి 90రోజులైనా ఇంతవరకు న్యాయం జరగలేదని వాపోయారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల కవాతు



పుల్లేరులో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

గోరంట్ల, మార్చి 22: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరుగడానికి మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో సీఐ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం కవాతు నిర్వహించారు సమస్యాత్మక గ్రామాలైన పుల్లేరు, వెంకటరమణపల్లి, శెట్టి చిన్నంపల్లి, బూదిలి గ్రామాల్లో పోలీసులు, బీఎస్‌ఎఫ్ సిబ్బందితో కలిసి ఆయా గ్రామాల వీధుల్లో కవాతు నిర్వహించారు. ప్రజలు ఎన్నికల్లో ధైర్యంగా ఓటు హక్కును వినియోగించు కోవడానికి తాము అండగా ఉంటామని ఈ ప్రదర్శన జరిపినట్లు పోలీసులు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎస్‌ఐ బాలాజీ, ఏఎస్‌ఐ ధనుంజయరెడ్డి, పోలీస్, బీఎస్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.